బుధవారం
WEDNESDAY
11.12.2024
సంచిక: 111
సంపుటి: 16
వెల రూ.6.00
పేజీలు: 8
PAGES: 8
హైదరాబాద్
HYDERABAD

సమగ్ర కథనాలు, ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

ఋషి

ధర్మం కోసం అక్షర తపస్సు తెలుగు దినపత్రిక

శ్రీకృష్ణుడి మాట

అన్నం వల్ల జంతు జాలం పుడుతుంది. వర్షం వల్ల అన్నం సమకూరుతుంది. యజ్ఞం వల్ల వర్షం కలుగుతుంది. ఆ యజ్ఞం కర్మ వల్లే సంభవిస్తుంది.

ముహూర్తం

11 డిసెంబర్ 2024 - బుధవారం శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:40 సూర్యాస్తమయం - సా. 5:38 తిథి ఏకాదశి రా. 1:08o వరకు సంస్మృత వారం సౌమ్య వాసరః నక్షత్రం రేవతి ఉ. 11:48 వరకు యోగం వారియ సా. 6:39 వరకు కరణం వనిజ మ. 2:26 వరకు విష్టి రా. 1:08o వరకు వర్జ్యం ఉ. 6:11 నుండి ఉ. 7:40 వరకు దుర్ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:31 వరకు రాహుకాలం మ. 12:09 నుండి మ. 1:31 వరకు యమగండం ఉ. 8:02 నుండి ఉ. 9:24 వరకు గుళికాకాలం ఉ. 10:47 నుండి మ. 12:09 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:04 నుండి తె. 5:52 వరకు అమృత ఘడియలు తె. 3:15 నుండి తె. 4:43 వరకు అభిజిత్ ముహూర్తం లేదు
గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published From HYDERABAD || www.rhushinews.com facebook: rhushinews twitter: rhushinews instagram: rhushinews

కర్ణాటక
మాజీ ముఖ్యమంత్రి

ఎస్ఎం కృష్ణ కన్నుమూత

సంతాపం తెలిపిన ప్రధాని మోదీ, ప్రముఖులు

బెంగళూరు,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ (92) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున బెంగళూరులోని సదాశివనగర్‌లో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన స్వగ్రామం మద్దూరులోని సోమనహళ్లిలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్. ఎం కృష్ణ మృతి నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం 3 రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. పూర్తి అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు

తరువాయి 2 వ పేజీలో...

మోహన్ బాబు రౌడీయిజం

అయ్యప్ప మాలలో ఉన్న జర్నలిస్టుపై దాడి

- విచక్షణ కోల్పోయి మైక్‌తో చితకబాదిన మోహన్ బాబు
- తీవ్రంగా ఖండించిన జర్నలిస్టు సంఘాలు
- కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్
- జర్నలిస్టుపై దాడిని ఖండించిన అన్ని వర్గాలు
- మోహన్‌బాబు, విష్ణు గన్స్ సీజ్‌కు సీపీ ఆదేశం
- తండ్రి, ఇద్దరు కొడుకులకు నోటీసులు జారీ
- నేడు 10:30కి హాజరు కావాలని ఆదేశాలు
- జల్‌పల్లి ఇంటి గేటు పగలగొట్టి లోపలికి మనోజ్
- తనపైనా దాడికి పాల్పడ్డారని తండ్రి, బౌన్సర్లపై ఆరోపణ

హైదరాబాద్, డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): నటుడు మోహన్ బాబు రౌడీయిజానికి పాల్పడ్డారు. విచక్షణ కోల్పోయి ఓ మీడియా ప్రతినిధిని మైక్‌తో చితకబాదారు. మంచు ఫ్యామిలీలో గొడవపై స్పందించాలని ఓ చానల్ ప్రతినిధి ఆయనను కోరగా.. ఏం చెప్పాలంటూ మైక్ లాక్కొని, ఆ మైక్‌తోనే దాడి చేశారు. ఈ దాడిలో జర్నలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. నొప్పితో విలవిల్లాడుతూ శంషాబాద్‌లోని ఓ దవాఖానలో చేరారు. ఆయనకు సీటీ స్కాన్ చేయగా.. తల ఎముక ఫ్రాక్చర్ అయినట్లు తెలిసింది. వెంటనే ప్లాస్టిక్ సర్జరీ చేయాలని దవాఖాన వైద్యులు తెలిపారు. వివరాల్లోకెళితే.. రంగారెడ్డి జిల్లా జల్‌పల్లిలోని మంచు మోహన్ బాబు ఇంటి వద్ద ఉదయం నుంచి హైడ్రామా నెలకొంది. వారి ఫ్యామిలీలో విభేదాలు తారా స్థాయికి చేరాయి. మంగళవారం ఉదయం నుంచి మంచు మోహన్ బాబు, ఆయన చిన్న కుమారుడు మంచు మనోజ్ మధ్య జరిగిన చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో సాయంత్రం భార్యతో కలిసి అడిషనల్ తరువాయి 2 వ పేజీలో...

46 జీవోపై ప్రభుత్వ వైఖరి ఏంటి?

పోస్టుల భర్తీలో అవలంబించిన విధానం ఏమిటి?

సరైన కౌంటర్ దాఖలు చేయండి.. తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశం

తదుపరి విచారణను జనవరి 27కు వాయిదా

హైదరాబాద్,డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణలో 5010 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కోసం రేవంత్ రెడ్డి సర్కార్ జీవో నెంబర్ 46ను సవాలు చేస్తూ.. సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు కాగా.. ప్రతివాది అయిన తెలంగాణ ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన 46 జీవోను సవాలు చేస్తూ.. కొందరు అభ్యర్థులు మొదట హైకోర్టును ఆశ్రయించగా.. వారి వాదనలను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ మేరకు ఆగస్టు 28వ తేదీన ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. దీంతో.. హైకోర్టు తీర్పును సవాలు చేస్తున్న మాటూరి శ్రీకాంత్ సహా.. 74 మంది అభ్యర్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై.. జస్టిస్ అభయ్ ఎస్ ఓక, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ క్రమంలోనే.. ప్రతివాదులైన తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. 46 జీవోపై తమ వైఖరి, పోస్టుల భర్తీ విషయంలో అవలంబించిన విధానంపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 27వ తేదీకి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో.. బాధితుల తరఫు న్యాయవాది ఆధిత్య సోండీ.. కేసు పరిష్కారమయ్యే వరకు ఖాళీగా ఉన్న 900 పోస్టుల భర్తీని తరువాయి 2 వ పేజీలో...

బంగ్లాపై భారత్ సైనిక చర్య!?

- మోదీ సర్కారుకు హ్యూమన్ రైట్స్ సొసైటీ అభ్యర్థన
- బంగ్లాలో హిందువులను చంపేందుకు పాక్ బలగాలు
- మైనారిటీల రక్షణకు అంతర్జాతీయ కోర్టులో కేసు పెట్టాలి
- బంగ్లా హిందువులను భారత్‌లోకి అనుమతించాలి
- బంగ్లా ప్రధాని యూనస్ నోబెల్ వెనక్కి తీసుకోవాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో పలు కీలక తీర్మానాలు

3

బంగ్లాదేశ్ హిందువుల కొనసాగుతున్న నరమేధంపై అంతర్జాతీయ మానవహక్కుల దినం సందర్భంగా "మానవ హక్కుల సంస్థ" తెలంగాణ శాఖ మంగళవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం ఆవేదనతో ప్రతిధ్వనించింది. ప్రపంచవ్యాప్తంగా హిందూ సమాజం తక్షణం మరింత చైతన్య కావలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది.

వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రభుత్వంలో వివిధ హోదాలలో సేవలందించిన పూర్వ అధికారులు పాల్గొని బంగ్లాదేశ్‌లోని పరిణామాలకు సంబంధించిన చారిత్రక కారణాలు, తమ పరిశీలన-అనుభవాలు, నేటి పరిస్థితి, ప్రస్తుతం-భవిష్యత్తులో తీసుకోవలసిన చర్యలు, పరిష్కారం దిశగా సూచనలు చేస్తూ అర్థవంతమైన చర్చ జరిపారు. భారత ప్రభుత్వంతో పాటు పౌర సమాజం చేపట్టవలసిన కార్యాచరణపై పలు అంశాలతో తీర్మానాన్ని ప్రతిపాదించారు.

2

విజయవంతంగా మహాసభలు

ఏబీవీపీ హైదరాబాద్ మహానగర మహాసభలు మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియం వేదికగా విజయవంతంగా పూర్తయ్యాయి

మరోసారి హస్తినకు రేవంత్

పలువురు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం

3

ఈనెల 17న

తెలంగాణకు రాష్ట్రపతి

17 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోనే

అమరావతి పనులకు ఆమోదం

20 సివిల్ పనులకు

11,467 కోట్ల మేర వ్యయం

5

కేటీఆర్ ఇప్పుడు ఒక ఎమ్మెల్యే మాత్రమే

కేటీఆర్, కవితకు కుక్క కూడా ఓటు వేయదు: ఎంపీ అర్వింద్

గ్రూప్ 2 పరీక్షలు యథాతథం

వాయిదాకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్,డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): తెలంగాణ గ్రూప్ 2 పరీక్షలు మరో నాలుగు రోజుల్లో జరగనున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే హాల్ టికెట్లు కూడా టీజీపీఎస్సీ విడుదల చేసింది. అయితే గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ కొందరు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిని సోమవారం విచారించిన హైకోర్టు వాయిదాను తిరస్కరించింది. డిసెంబరు 15, 16 తరువాయి 2 వ పేజీలో...

ఋషి దినపత్రిక కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్న యువకులు 9666711515 నంబర్‌కు వాట్సాప్ ద్వారా,
rhushinews@gmail.com
మెయిల్‌కు బయో డేటా పంపగలరు.

బంగ్లాపై భారత్ సైనిక చర్య!?

- మోదీ సర్కారుకు హ్యూమన్ రైట్స్ సొసైటీ అభ్యర్థన
- బంగ్లాలో హిందువులను చంపేందుకు పాక్ బలగాలు
- మైనారిటీల రక్షణకుని అంతర్జాతీయ కోర్టులో కేసు పెట్టాలి
- బంగ్లా హిందువులను భారత్‌లోకి అనుమతించాలి
- బంగ్లా ప్రధాని యూసస్ నోబెల్ వెనక్కి తీసుకోవాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో పలు కీలక తీర్మానాలు

హైదరాబాద్, డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): బంగ్లాదేశ్ హిందువుల కొనసాగుతున్న నరమేధంపై అంతర్జాతీయ మానవహక్కుల దినం సందర్భంగా "మానవ హక్కుల సంస్థ" తెలంగాణ శాఖ మంగళవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం ఆవేదనతో ప్రతిధ్వనించింది. ప్రపంచవ్యాప్తంగా హిందూ సమాజం తక్షణం మరింత చైతన్య కావలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రభుత్వంలో వివిధ హోదాలలో సేవలందించిన పూర్వ అధికారులు పాల్గొని బంగ్లాదేశ్‌లోని పరిణామాలకు సంబంధించిన చారిత్రక కారణాలు, తమ పరిశీలన-అనుభవాలు, నేటి పరిస్థితి, ప్రస్తుతం-భవిష్యత్తులో తీసుకోవలసిన చర్యలు, పరిష్కారం దిశగా సూచనలు చేస్తూ అర్థవంతమైన చర్చ జరిపారు. భారత ప్రభుత్వంతో పాటు పౌర సమాజం చేపట్టవలసిన కార్యాచరణపై పలు అంశాలతో తీర్మానాన్ని ప్రతిపాదించారు. రౌండ్ టేబుల్‌లో ముఖ్యవక్తలుగా పాల్గొన్న భారత హోంశాఖ పూర్వ కార్యదర్శి పద్మనాభయ్య చర్చను ప్రారంభించారు. ఆఫ్ఘనిస్తాన్, బర్మా, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాలు ఒకనాడు భారత్‌లో భాగంగా ఉండేవని గుర్తు చేస్తూ పూర్వ ప్రధాని గుజ్రాల్ నేతృత్వంలోని ప్రభుత్వం "పొరుగు దేశాలకు ప్రాధాన్యత" అంటూ అనుసరించిన విధానం ఏ మేరకు విజయవంతమైందో నేటి పరిణామాలను చూసి మనమే గ్రహించాలన్నారు. సెక్యులర్ రాజ్యాంగం ఉన్నప్పటికీ ముస్లింలు అధికంగా ఉన్న బంగ్లాదేశ్‌లో హిందువులకు తీవ్ర నష్టం జరిగిందని, మన దేశంలో కూడా ముస్లిం జనాభా వేగంగా పెరుగుతున్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. భారతదేశంలో %ఖజజ%ని వెంటనే అమలు చెయ్యాలని పద్మనాభయ్య స్పష్టం చేశారు. అమెరికా, ఐరోపా దేశాలు ప్రపంచవ్యాప్తంగా పెత్తనం సాగిస్తూ వస్తున్నాయని పేర్కొన్న పద్మనాభయ్య అసలు మానవహక్కులకు సంబంధించి ప్రపంచంలో సర్వే నిర్వహించి కామెంట్స్ చేసే అధికారం అమెరికాకు ఎక్కడిదని ప్రశ్నించారు.

హింసాకాండకు యూనస్‌దే బాధ్యత: ఎంవీఆర్ శాస్త్రి

సీనియర్ పాత్రికేయులు ఎంవిఆర్ శాస్త్రి మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హింసాకాండకు ప్రధాన బాధ్యత ఆ దేశ ప్రధాని మహ్మద్ యూనస్‌దేనన్నారు. లక్షలాది మంది హిందువులపై మారణకాండ జరుగుతుంటే మౌనంగా ఉన్న కమ్యూనిస్టుల వైఖరిని ఎండగట్టారు. భారత్‌లో మైనార్టీల రక్షణ గురించి సెనెట్‌లో పెద్ద చర్చ చేపట్టిన అమెరికా నేడు బంగ్లాదేశ్‌లో లక్షలాది హిందువులు ఊచకోతకు గురవుతుంటే మౌనంగా ఉందని, అక్కడ చనిపోయినవారు హిందువులు కానట్లయితే భారీ చర్చ చేసేవారని అగ్రరాజ్యం వైఖరిని దుయ్యబట్టారు. 1946లో జిన్నా పిలుపుతో జరిగిన డైరెక్ట్ యాక్షన్ డే.. ఆ తర్వాత పాకిస్తాన్ పాలకుడు యాహ్యా ఖాన్ చేపట్టిన సెర్చిలైట్ ఆపరేషన్ హిందువులను దారుణంగా బలిగొన్నాయని, నాడు ఢాకా యూనివర్సిటీలో 10 వేల మంది విద్యార్థుల ప్రాణాలు తీశారని శాస్త్రి గుర్తు చేశారు. బంగ్లాదేశ్ మారణకాండపై ఇంగ్లాండ్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో చర్చ జరగాలని ఆ దేశ ఎంపీలు కోరుతుండగా... మరోవైపు అమెరికా సెనెటర్ తులసీ గబార్డ్ బంగ్లాదేశ్ పరిణామాలను తీవ్రంగా ఖండించారని, అయితే భారత పార్లమెంటులో మాత్రం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చర్యలు జోకర్‌ని తలపిస్తున్నాయని మండిపడ్డారు. బంగ్లాదేశ్ హిందువులను కాపాడే క్రమంలో పాకిస్తాన్‌కు సైతం బుద్ధి చెప్పాలంటే 1971 నాటి పరిణామాల తరహాలోనే అక్కడ భారత్ జోక్యం చేసుకోవాలని, వారికి అర్థమయ్యే భాష అదేనని, అప్పుడు మాత్రమే ఈ సమస్య పరిష్కారమవుతుందని తేల్చి చెప్పారు. సామాజిక కార్యకర్త, న్యాయవాది అయిన మోనికా ఆరోరా స్పందిస్తూ బంగ్లాదేశ్ పరిణామాలపై 4 నెలల పాటు తాము నిర్వహించిన నిజ నిర్ధారణ కార్యాచరణ నివేదికలోని అంశాలను రౌండ్ టేబుల్ ముందుంచారు. బంగ్లాదేశ్‌లో కేవలం పేదలు, బలహీన వర్గాల హిందువులపై మాత్రమే దాడులు జరుగుతున్నాయనుకోవడం సరికాదంటూ ఆ సమాజంలో మంచి సేవలతో పేరు ప్రఖ్యాతులు పొందిన లాయర్లు, డాక్టర్లు, ప్రొఫెసర్లు, వ్యాపారులైన హిందువులు, బంగ్లాదేశ్ పోలీస్, ఆర్మీలో ఉన్న హిందువులను సైతం ఊచకోతకు గురి చేస్తున్నారని తెలిపారు. దాడులకు పాల్పడినవారిలో బాధితుల ఇరుగుపొరుగువారు, బయటివారు అందరూ ఉన్నారని వివరాలందించారు.

ప్రాణాలతో ఉండాలంటే మతం మారాలి లేదా లక్షలాది బంగ్లాదేశ్ కరెన్సీతో జిజియా (లంచం) కట్టాలని డిమాండ్ చేస్తూ బీఎన్‌పీ పార్టీ కార్యకర్తలు, జమాతే ఇస్లామీ తీవ్రవాదులు రేయింబవళ్లు హిందువులే లక్ష్యంగా వెంటాడున్నారని చెప్పారు. నిజనిర్ధారణ ప్రక్రియలో భాగంగా మోనికా బృందం బంగ్లాదేశ్‌లో మాట్లాడిన లాయర్లు, డాక్టర్లు, కళాకారుల అనుభవాలు, వేదనను, వారితో జరిగిన ఆవేదనా భరిత సంభాషణలను సభలో వెల్లడించారు. బంగ్లాదేశ్‌ని వీడిన మైనార్టీల ఆస్తుల స్వాధీనంతో పాటు ప్రస్తుతం ఉంటున్న మైనార్టీలు ఆస్తులు అమ్మడానికి వీల్లేకుండా, కనీసం బదలాయింపు చెయ్యకుండా వేధిస్తున్న ఆ దేశ చట్టాల క్రౌర్యాన్ని మోనికా వివరించారు. ప్రస్తుతం పాక్ సర్కారు సైతం బంగ్లాదేశ్‌తో జట్టు కట్టి ఆయుధాలు, బలగాల తరలింపు చేస్తోందన్నారు. బంగ్లాదేశ్ సామాజిక పరిస్థితులను కళ్లకు కట్టినట్టు వివరించిన తస్లీమా నస్రీన్ లజ్జ నవల ఎంత సంచలనం సృష్టించిందో వెల్లడిస్తూ హైదరాబాదులో సైతం తస్లీమాపై జరిగిన దాడుల ఘటనను గుర్తు చేశారు. ప్రస్తుతం అరెస్ట్ అయిన ఇస్కాన్ సన్యాసి చిన్మయ్ కేవలం మైనార్టీల రక్షణకు డిమాండ్ చేసినందుకే అరెస్ట్ చేశారని, అందులో భాగంగా మైనార్టీలకు ఒక మంత్రిత్వశాఖ, మైనార్టీల కేసుల విచారణకు ట్రిబ్యునల్, దుర్గాపూజకు అనుకూల వాతావరణం, మైనార్టీలకు గౌరవప్రదమైన జీవనం కోరారని మోనికా వివరించారు. చిట్టగాంగ్ సమావేశంలో బంగ్లాదేశ్ జెండాని తక్కువ ఎత్తులో ఉంచారంటూ చిన్మయ్ పై దేశద్రోహం కేసు పెట్టి అరెస్ట్ చేశారని చెప్పారు. ప్రజ్ఞాభారతి ఛైర్మన్ హనుమాన్ చౌదరి స్పందిస్తూ ఇస్లామిక్ సమాజంలో ముస్లిమేతరులకు మానవహక్కులు లేవన్నారు. క్రీ.శ 623, 624 సంవత్సరాలలో మహ్మద్ ప్రవక్త ఉన్న కాలంలో యూదులకు ఇవే పరిస్థితులు ఎదురయ్యాయని, ఆ తర్వాత కాశ్మీర్‌లోను ఆ పరిస్థితులో పునరావృతమయ్యాయని తెలిపారు. 1946లో నౌఖాలీలో మొదలైన మారణకాండ నిరాటంకంగా కొనసాగుతూనే ఉందని హనుమాన్ చౌదరి ఆవేదన వ్యక్తం చేస్తూ బంగ్లాదేశ్ పరిణామాల నడుమ అక్కడి హిందువులందరినీ భారత్‌లోకి అనుమతించేలా జనాభా మార్పిడి జరగాలని సూచించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సైతం ఇదే అంశాన్ని లేవనెత్తారని తెలియజేస్తూ బల్గేరియా పరిణామాలను సభకు వివరించారు. బంగ్లాదేశ్ మారణకాండపై ఐక్యరాజ్యసమితితో పాటు అంతర్జాతీయ కోర్టు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఇక హైదరాబాదులో అక్రమ కట్టడాల కూల్చివేతకు ఉద్దేశించిన హైడ్రా ముస్లింలవైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఎత్తి చూపారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ స్పందిస్తూ బంగ్లాదేశ్ హిందువుల విషయంలో భారతదేశం వ్యక్తం చేసిన ఆందోళనపై అది తమ ఆంతరంగిక విషయమంటూ బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జషిముద్దీన్ చేసిన వ్యాఖ్యల వెనుక అంతరార్థాన్ని గుర్తించాలని హెచ్చరించారు. ఇది చాలక భారత్‌లోని బెంగాల్, బీహార్, ఒడిషా రాష్ట్రాలను కూడా తీసుకుంటామని బంగ్లాదేశ్‌లోని బీఎన్‌పీకి చెందిన వ్యక్తులు చేసిన హెచ్చరికల వెనుక ఎవరున్నారో గ్రహించాలన్నారు. సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్ మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న మారణకాండ యావత్ ప్రపంచానికీ చేరాలని ఆకాంక్షించారు. ఇందుకోసం పలు అంశాలతో కూడిన కార్యాచరణను అనుసరించాలన్నారు. అవి.. 1. దేశరాజధాని ఢిల్లీలో ధర్మాచార్యులతో సభ 2. బంగ్లాదేశ్ హిందువుల భవిష్యత్తు ప్రపంచంలోని హిందువుల భవిష్యత్తు అని గ్రహించేలా భారత రాష్ట్రపతితో ప్రకటన చేయించడం 3. హిందువుల వేదనను తెలియజేసేలా వీలైనన్ని దేశవ్యాప్తంగా ఏకకాలంలో ర్యాలీలు జరగాలి 4. యువతరం స్పందించకుంటే వారి కుటుంబాలు దానికి మూల్యం చెల్లించుకోవాలనే సందేశం వెళ్లాలి. రౌండ్ టేబుల్‌లో భాగంగా మాట్లాడిన పలువురు వక్తలు హిందువులు మరింత చైతన్యవంతులు కావాలని, 2047 నాటికి భారత్ ఇస్లామీకరణ పేరిట పీఎఫ్ఐ విడుదల చేసిన పత్రం, 15 నిమిషాలు పోలీసులు పక్కన ఉంటే సత్తా చూపిస్తామంటూ ఎంఐఎం నేత అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు, కాశ్మీర్ సహా బెంగాల్, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలలోని పరిణామాలను గుర్తు చేసి హిందువులను అప్రమత్తం చేసే ప్రయత్నం చేశారు.

రౌండ్ టేబుల్ ప్రతిపాదిత తీర్మానాలు..

1. బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న మారణకాండ, మైనార్టీల మానవహక్కుల ఉల్లంఘనకు శాశ్వతంగా ముగింపు పలికేలా భారత ప్రభుత్వం వెంటనే అన్ని రకాల చర్యలూ తీసుకోవాలి.
2. బంగ్లాదేశీయులు ఆ దేశంలోని హిందువులపై కొనసాగిస్తున్న మారణకాండ, మైనార్టీల మానవహక్కుల ఉల్లంఘనకు శాశ్వతంగా వెంటనే ముగింపు పలికేలా ఒత్తిడి తెచ్చే విధంగా భారత ప్రభుత్వం ఈ విషయాన్ని యూఎన్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సహా అన్ని అంతర్జాతీయ వేదికలపైనా లేవనెత్తాలి.
3. భారత్‌లోను, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాధ్యతగల పౌర సమాజం యావత్తూ బంగ్లాదేశ్ హిందువులపై కొనసాగుతున్న మారణకాండ, మైనార్టీల మానవహక్కుల ఉల్లంఘనకు శాశ్వతంగా వెంటనే ముగింపు పలికేలా బంగ్లాదేశీయులపై ఒత్తిడి తీసుకురావాలి. బంగ్లాదేశ్‌లోని హిందువులను ముగించేందుకు గాను ఆ దేశంలోని పౌర సమాజ వర్గాలతో సంప్రదింపులు జరపాలి.
4. బంగ్లాదేశ్ ప్రధానమంత్రి మహ్మద్ యూనస్‌కి గతంలో ప్రదానం చేసిన నొబెల్ బహుమతిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.
5. బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల్లోని హిందువులు, ఇతర మైనార్టీలు భారతదేశంలో వేగంగా పౌరసత్వం పొందేలా తేదీలకు సంబంధించిన నియంత్రణలను మార్చుతూ సీఏఏను సవరించాలి లేదా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులందరికీ భారతదేశ పౌరసత్వాన్ని అందించే విధంగా ఇజ్రాయెల్ తరహా విధానాన్ని అమలు చెయ్యాలి.
6. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులపై భవిష్యత్తులో ఏ విధమైన హింస జరుగకుండా నిరోధించేలా తీసుకోవలసిన చర్యలను సిఫారసు చేసి ఈ సమస్యను మొగ్గలోనే తుంచివెయ్యాలి.
7. బంగ్లాదేశ్‌లో ఇప్పటికే అరెస్ట్ చేసినవారిని వెంటనే విడుదల చేసి వారి రక్షణకు హామీ ఇవ్వాలి.
8. ప్రపంచవ్యాప్తంగా హిందువులపై జరుగుతున్న హింసకు శాశ్వతంగా ముగింపు పలికేలా దీర్ఘకాల, స్వల్పకాల పరిష్కారాలపై దృష్టి సారించాలి.

మోహన్ బాబు రౌడీయిజం

మొదటి పేజీ తరువాయి

డీజీపీని కలిసిన మనోజ్ తిరిగి జల్‌పల్లి చేరుకున్నాడు. లోనికి వెళ్లిన మంచు మనోజ్‌పై దాడి జరిగినట్లు తెలిసింది. చిరిగిన చొక్కాతో మంచు మనోజ్ బయటకు రావడం కనిపించింది. ముందుగా మనోజ్ దంపతులను అక్కడున్న భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. గేట్లు తీయాలంటూ సెక్యూరిటీ సిబ్బందిపై మనోజ్ మండిపడ్డారు. తమ కుమార్తె లోపల ఉందని లోనికి వెళ్లాలని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎంత సేపటికి గేట్లు తీయకపోవడంతో నెట్టుకొని లోపలికి వెళ్లాడు. కాసేపటి తరువాత మంచు మనోజ్ చిరిగిన చొక్కాతో బయటకు రావడం కనిపించింది. ఈ సమయంలో లోనికి వచ్చిన మీడియా ప్రతినిధులపై మోహన్‌బాబు ఆగ్రహంతో ఊగిపోయారు. వారిపై దాడికి పాల్పడ్డారు. బౌన్సర్ల దాడిలో ఓ కెమెరామెన్ కిందపడిపోయారు. మీడియా ప్రతినిధులను బయటకు నెట్టి బౌన్సర్లు గేటుకు తాళం వేశారు. మీడియా ప్రతినిధిపై మోహన్ బాబు దాడి చేయడంతో జర్నలిస్టులు ఆయన ఇంటి దగ్గర ఆందోళనకు దిగారు. మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుక సంఘీభావంగా తెలుగు రాష్ట్రాల్లోని జర్నలిస్టులంతా ఏకమయ్యారు. దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ..మోహన్ బాబు చర్యను తీవ్రంగా ఖండించారు.

మంచు మనోజ్‌పైనా కేసు

మోహన్‌బాబు ఫిర్యాదు మేరకు హైదరాబాద్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో మనోజ్‌పై కేసు నమోదైంది. ఇవాళ పెద్దమనుషుల సమక్షంలో జరిగిన మోహన్‌బాబు, విష్ణు, మనోజ్ మధ్య జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. ఇది ఆస్తి కోసం కాకుండా ఆత్మగౌరవం కోసం చేస్తున్న పోరాటమని మనోజ్ తెలిపారు. తన భార్య మౌనికతో కలిసి అద నపు డీజీపీ మహేశ్ భగవత్‌ను కలిశారు. న్యాయం కోసం స్టేషన్లో ఫిర్యాదు చేస్తే పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని వారు అదనపు డీజీపీకి విజ్ఞప్తి చేశారు. ఇంట్లో ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు తనపై దాడికి యత్నించార ని మనోజ్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుమారుడు మనోజ్‌తో పాటు ఆయన భార్య మౌనికతో తనకు హాని ఉందని రాచకొండ కమిషనర్‌తో పాటు పహాడీషరీఫ్ పీఎస్‌లో మోహన్ బాబు సైతం ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదు లను స్వీకరించిన పోలీసులు కేసులు నమోదు చేశా రు. ఇవాళ విదేశాల నుంచి తిరిగి వచ్చిన పెద్ద కుమారుడు విష్ణుకు మోహన్ బాబు ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికి ఇంటికి తీసుకొచ్చారు. అనంతరం సన్నిహితుల సమక్షంలో మోహన్ బాబు, విష్ణు, మనోజ్ సమస్య పరిష్కారానికి చర్చలు జరిపారు. ఈ క్రమంలోనే చర్చల మధ్యలోంచే భార్య మౌనికతో పాటు బౌన్సర్లను తీసుకొని మనోజ్ బయటకు వచ్చారు. చర్చల సమయంలో తన భార్యతో పాటు తన బౌన్సర్లను బయటకు పంపే ప్రయత్నం చేశారని మనోజ్ మీడియాకు తెలిపారు. ఈ వివాదంలోకి తన భార్యతో పాటు 7 నెలల కుమార్తెను లాగడం అమానుషం అంటూ మనోజ్

గ్రూప్ 2 పరీక్షలు యథాతథం

మొదటి పేజీ తరువాయి



తేదీల్లో జరగనున్న పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని, ఈ పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. కాగా డిసెంబరు 16న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పరీక్షలున్నందున గ్రూప్ 2ను వాయిదా వేయాలని కోరుతూ టీజీపీఎస్సీకి ఇచ్చిన వినతిపత్రంపై స్పందించకపోవడాన్ని సవాలు చేస్తూ ఆర్.జ్యోతి అనే అభ్యర్థితోపాటు వివిధ జిల్లాలకు చెందిన సుమారు 22 మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ పుల్లా కార్తీక్ ఇరు పక్షాల వాదనలు విన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ డిసెంబర్ 16న గ్రూప్ 2 కి సంబంధించి పేపర్ 3, 4 పరీక్షలు ఉన్నాయని, అదేరోజు ఆర్ఆర్‌బీ పరీక్ష కూడా ఉందని అన్నారు. రెండింటికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒక పరీక్ష రాస్తే మరో పరీక్షను కోల్పోవల్సి వస్తుందని, అందువల్ల గ్రూప్ 2 పరీక్షలను రీషెడ్యూల్ చేయమని కోరుతూ టీజీపీఎస్సీకి నవంబరు 25న వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోలేదన్నారు.ఇక మరోవైపు టీజీపీఎస్సీ తరపు న్యాయవాది రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. 783 పోస్టులకు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, ఇప్పటికే హాల్‌టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయన్నారు. కేవలం 22 మంది కోసం పరీక్ష వాయిదా వేస్తే కొందరికే ప్రయోజనం ఉంటుందని, మిగతా లక్షల మంది అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి పరీక్ష ఏర్పాట్లన్నీ పూర్తయినందున.. ఈ స్థాయిలో పరీక్షలు వాయిదా వేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ టీజీపీఎస్సీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 6కు వాయిదా వేసింది.కాగా తెలంగాణలో గ్రూప్ 2 పరీక్షల హాల్‌టికెట్లు తాజాగా విడుదలయ్యాయి. డిసెంబర్ 15, 16 తేదీల్లో జరగనున్న ఈ పరీక్షల హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ తన అధికారిక వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు అందుబాటులోకి లింక్ తీసుకు వచ్చింది. మొత్తం 4 పేపర్లకు ఈ పరీక్షలు ఉంటాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5.51లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా పరీక్షకు హాజరుకానున్నారు. ఇతర సమాచారం కోసం టీజీపీఎస్సీ హెల్ప్‌లైన్ నంబర్లు 040-22445566/ 23542185/23542187ను సంప్రదించవచ్చు.

46 జీవోపై ప్రభుత్వ వైఖరి ఏంటి?

నిలిపేయాలని వాధించారు. స్పందించిన సుప్రీం కోర్టు.. తదుపరి విచారణ వరకు వేచిచూడాలని స్పష్టం చేసింది. బాధితుల పక్షాన విచారణకు బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, ఏనుగుల రాకేష్ రెడ్డి కూడా హాజరయ్యారు. అయితే.. పోలీస్ ఉద్యోగాల భర్తీ కోసం జోవో నెంబర్ 46ను తెలంగాణ ప్రభుత్వం జారీ చేయగా.. దాన్ని డిమాండ్ చేస్తూ.. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు నిరసనకు దిగిన విషయం తెలిసిందే. జీవో నెంబర్ 46ను రద్దు చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నాలు నిర్వహించారు. కాగా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటి పరిస్థితులకు అనుగుణంగా జీవో 46 ను తీసుకొచ్చింది. అయితే దీని వల్ల చాలా మంది అర్హులు ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని పోలీసు ఉద్యోగార్థులు పెద్ద ఎత్తున ఉద్యమం చేశారు. జీవో 46ను రద్దు చేయాలని తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేయడంతో భాదితులు.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఎస్ఎం కృష్ణ కన్నుమూత

నిర్వహించను న్నట్లు తెలిపింది. ఎస్.ఎం కృష్ణ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. 'కృష్ణ ఒక అద్భుమైన నేత. అన్ని వర్గాల ప్రజల నుంచి అభిమానాన్ని అందుకున్నారు. తన జీవితాంతం ఇతరుల కోసం పాటు పడ్డారు. కర్ణాటక సీఎంగా అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి. ప్రత్యేకంగా మౌలిక సదుపాయల కల్పనపై ఆయన ఎక్కువ దృష్టి సారించారు. ఎస్ఎం కృష్ణలో గొప్ప పాఠకుడు, ఆలోచనాపరుడు ఉన్నారు' అని ఎక్స్ వేదికగా తెలిపారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు నేతలు ఎస్?ఎం కృష్ణ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మైసూర్‌లోని మహారాజా కళాశాలలో ఎస్ఎం కృష్ణ పట్టభద్రుడయ్యారు. బెంగళూరులోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో చదివారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో గుర్తింపు పొందారాయన. 1971- 2014 వరకు, అతను వివిధ సమయాల్లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యునిగా సేవలందించారు. డిసెంబర్ 1989 నుండి జనవరి 1993

త్వరలోనే చేనేత రుణమాఫీ

తుమ్మల కీలక ప్రకటన.. తెలంగాణ నేతన్నలకు శుభవార్త

హైదరాబాద్,డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే రూ.2 లక్షల రైతు రుణమాఫీ అమలు చేసినట్లు చెప్పారు. మొత్తం 4 విడతల్లో దాదాపు 25 లక్షల రైతుల అకౌంట్లలో రూ.22 వేల కోట్ల నగదు జమ చేసినట్లు చెప్పారు. తాజాగా... తెలంగాణలోని నేతన్నలకు సైతం మంత్రి శుభవార్త చెప్పారు. రాష్ట్రంలో చేనేత రంగం సమగ్రాభివృద్ధికి రూ.238 కోట్లతో చేనేత అభయహస్తం పథకాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. అన్నదాతల మాదిరిగానే చేనేత కార్మికులకూ రుణమాఫీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించామన్నారు. ఆర్థిక శాఖ నుంచి ఆమోదం రాగానే చేనేత రుణమాఫీ అమలుచేస్తామన్నారు. ' చేనేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పనకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. అన్ని ప్రభుత్వశాఖలు తమ అవసరాల కోసం చేనేత వస్త్రాలను టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలి. ప్రైవేటుసంస్థల వద్ద కొనుగోలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేత, జౌళి శాఖకు సంబంధించిన బకాయిలను చెల్లించలేదు. దాంతో ఆ భారం మా ప్రభుత్వంపై పడింది. రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమం కోసం బతుకమ్మ చీరలు, ఇతర పథకం కింద రూ.428 కోట్లు విడుదల చేశాం. నేతన్నకు చేయూత పథకం కింద మరో రూ.290.09 కోట్ల బకాయిలు విడుదల చేశాం. మరమగ్గాల పథకం కింద చేనేతలను ఆదుకునేందు రూ.5.45 కోట్లు, 10 శాతం నూలు సబ్సిడీ కింద మరో రూ.37.49 కోట్లు, పావలావడ్డీ కింద రూ.1.09 కోట్లు చేనేతల సంక్షేమానికి విడుదల చేశాం.' అని మంత్రి తుమ్మల వెల్లడించారు. చేనేత కార్మికుల ఉపాధి కోసం.. ప్రతి ఏడాది 64.70 లక్షల మంది స్వయంసహాయక సంఘాల మహిళలకు రెండు చొప్పున ఏకరూప చీరల పంపిణీ పథకాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. జాతీయ చేనేత సాంకేతిక సంస్థ కి త్వరలోనే శాశ్వత క్యాంపస్ నిర్మాణాన్ని ప్రారంభిస్తామని స్పష్టం చేసారు. చేనేతలను ఆదుకుంటామని.. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తుమ్మల వెల్లడించారు.

విజయవంతంగా ఏబీవీపీ మహాసభలు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): ఏబీవీపీ హైదరాబాద్ మహానగర మహాసభలు ఈ రోజు ఉస్మానియా యూనివర్సిటీలోని తాగూర్ ఆడిటోరియం వేదికగా విజయవంతంగా పూర్తయ్యాయి. 2024-25 విద్యా సంవత్సరానికి గాను నూతన అధ్యక్షులుగా డాక్టర్ మాళవిక, నూతన కార్యదర్శిగా పృథ్వి తేజ ని ఎన్నుకోవడం జరిగింది. ఉద్ఘాటన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్షేత్రీయ సంఘటన మంత్రి శివకుమార్ జీ అతిథులుగా జాతీయ కార్యదర్శి శ్రవణ్ రాజ్ పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ మహాసభల్లో మొత్తం దాదాపు 150 కళాశాలల నుండి 920 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

కేటీఆర్ ఇప్పుడు ఒక ఎమ్మెల్యే మాత్రమే

కేటీఆర్, కవితకు కుక్క కూడా ఓటు వేయదు: ఎంపీ అర్వింద్

హైదరాబాద్,డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ నేత, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ... కేటీఆర్, కవితలకు వచ్చే ఎన్నికల్లో కుక్క కూడా ఓటు వేయదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఇప్పుడు ఒక ఎమ్మెల్యే మాత్రమేనని గుర్తుంచుకోవాలని సూచించారు. తాను ఎప్పుడూ ఫైర్ బ్రాండ్‌నే అని మీడియా ప్రతినిధులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నా బండి నా చేతిలోనే ఉందని... సమయాన్ని బట్టి తాను గేర్ మారుస్తానని, అప్పుడే స్పీడ్ మారుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తెలంగాణ తల్లి విగ్రహం పేరుతో పిచ్చి రాజకీయం చేస్తున్నారని దుయ్యబట

స్వార్థ రాజకీయాల కోసం విగ్రహాలు మార్చడం బాధాకరం

కేసీఆర్ పోరాటాన్ని రూపుమాపేలా సీఎం రేవంత్ ప్రయత్నాలు

రానున్న రోజుల్లో రేవంత్‌కు గుణపాఠం తప్పదు : కవిత

హైదరాబాద్, డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణ ఉద్యమసమయం నుంచి ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం ఎంతో బాధాకరమని, దీనిని తెలంగాణ ప్రజలు హర్షించరని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ చేసిన ఉద్యమాన్ని పూర్తిగా మర్చిపోవటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ కేసీఆర్ తెలంగాణ ప్రజల్లో గుండెల్లో ఎప్పటికీ ఉంటాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహం మార్పునకు నిరసనగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదగానే ఉండాలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు. ఉద్యమ తల్లే తమ తల్లి అని, హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదన్నారు. రేవంత్ పిట్ట బెదిరింపులకు భయపడేవారు ఎవరూలేరన్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యమకారులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చింది. జొన్నలు, మక్కలు ఇతర రాష్ట్రాల్లో కూడా పండుతాయి. పూలనే పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణది. తెలంగాణ తల్లి చేతి నుంచి బతుకమ్మను తొలగించారు. తెలంగాణ ప్రత్యేకతే బతుకమ్మ. మహిళలకేమో విగ్రహాలు.. మగవాళ్లకేమో వరాలా అని ప్రశ్నించారు. తెలంగాణ తల్లిని మార్చి కాంగ్రెస్ తల్లిని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. 9 మంది తెలంగాణ కవులు, కళాకారులకు స్థలాలు, డబ్బులిస్తామన్నరు. గుర్తింపునకు మల్లు స్వరాజ్యం, విమలక్క, సంధ్య పనికిరారా అని ప్రశ్నించారు. గ్రాండ్‌గా ఉండే తల్లిని తీసేసి.. బీద తల్లిని పెట్టినమని రేవంత్ గొప్పలు చెప్తుండు. తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదగానే ఉండాలా అన్ని ప్రశ్నించారు. మీ నోటి నుంచి ఎరుకల నాంచారమ్మ, బీడీ కార్మికుల మహిళల పేరు రాలేదన్నారు. ఉద్యమ కాలంలో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లిని మార్చారని విమర్శించారు. విగ్రహం పెట్టామని చెప్పి సామన్య మహిళలకు ఇచ్చిన హామీలు ఎగ్గొడతారా అని నిలదీశారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు. ఉద్యమ తల్లే మా తల్లి.. హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదన్నారు. రేవంత్ పిట్ట బెదిరింపులకు ఎవరూ భయపడరని తెలిపారు.

అదానీ నిరసనలో కాంగ్రెస్ ద్వంద వైఖరి

రాహుల్ మీ అడుగుజాడల్లోనే మేము ఎక్స్ వేదికగా కాంగ్రెస్‌ను ప్రశ్నించిన కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): అదానీ వ్యతిరేక నిరసనల్లో కాంగ్రెస్ ద్వంద్వవైఖరి పాటిస్తోందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. పార్లమెంట్‌లో ఒకలా, తెలంగాణ అసెంబ్లీలో మరోలా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'రాహుల్ జీ ఇది ఎలాంటి వంచన..? పార్లమెంట్‌లో అదానీ ఫొటో ఉన్న టీషర్ట్ ధరించడం మీకు సరైనదే అయితే.. మీ అడుగుజాడల్లో నడిచి తెలంగాణ అసెంబ్లీలో అదానీ రేవంత్ వ్యవహారాన్ని బయట పెట్టడానికి మాకు ఎందుకు అనుమతి లేదు..? దీనికి సమాధానం చెప్పండి' అంటూ కేటీఆర్ నిలదీశారు. ఈ మేరకు రాహుల్.. మోదీ అదానీ చిత్రాలతో ఉన్న టీషర్ట్‌లను ధరించిన ఫొటోలను ట్వీట్‌కు జతచేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.

ప్రజాపీడిత పాలన : కేటీఆర్

కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా అధికారంలోకి రావాలని ఇష్టంవచ్చినట్లు హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయటానికి నానా కారణాలు చెబుతుందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా పీడిత పాలన అని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజల వేదన అరణ్య రోదనగానే మిగిలిందని విమర్శించారు. రైతులను చెరబట్టారని, పేదల ఇండ్లు కూలగొట్టారని ధ్వజమెత్తారు. రైతుబంధు ఎత్తేశారని, రైతుబీమాకు పాతరేశారని, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ మాయం చేశారని, అమ్మవడిని ఆగం చేశారని దుయ్యబట్టారు. నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారని, ఏక్ పోలీస్ అన్న పోలీసులను అణగదొక్కారని చెప్పారు. హామీల అమలు అడిగిన ఆడబిడ్డలు, ఆశాలను అవమానించారని మండిపడ్డారు. టీఎస్ టీజీగా చేసి చార్మినార్, కాకతీయ కళా తోరణాలను తొలగించారన్నారు. తెలంగాణ బిడ్డలు లాఠీలకు, తూటాలకు ఎదురొడ్డి ఆత్మబలిదానాలతో ఉద్యమిస్తున్నప్పుడు.. సమైక్యవాదుల పంచనచేరి వంచన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార అహంకారంతో ఇప్పుడు ఏకంగా అమ్మనే మార్చారని విమర్శించారు. చరిత్రను చెరిపేస్తామన్న భ్రమలో తెలంగాణ ప్రజలను ఏమారుస్తాం అనుకుంటే పొరపాటేనని చెప్పారు. తెలంగాణ అన్నీ గమనిస్తున్నది, కాలంబు రాగానే కాటేసి తీరుతుందన్నారు.

మీ పనైపోయింది బిడ్డా..!

అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ నేతలు కలలు

విరుచుకుపడ్డ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

తెలంగాణ తల్లి విగ్రహంపై మాటల యుద్ధం

హైదరాబాద్,డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): తెలంగాణ తల్లి విగ్రహంపై అధికార-విపక్షాల మధ్య మాటల యుద్ధం కంటిన్యూ అవుతోంది. బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి. మీరు అధికారంలోకి వస్తామని కళలు కంటున్నారని, మీ పనైపోయింది బిడ్డా తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. రాజకీయం కోసం బీఆర్ఎస్ దిగజారి మాట్లాడుతోందని ఆరోపించారు యెన్నం శ్రీనివాస్ రెడ్డి. ముఖ్యంగా కవిత, కేటీఆర్ మరింత దిగజారి మాట్లాడుతున్నారని విమర్శలు గుప్పించారు. చట్టసభల ద్వారా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, విగ్రహం టచ్ చేసి చూడండంటూ కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుకు ఛాలెంట్ విసిరారు. తెలంగాణ తల్లి విగ్రహం ఇప్పుడు తెలంగాణ ప్రజల సొంతమన్నారు. తెలంగాణ తల్లి ఆవిష్కరణ జరిగి ప్రజలు సంతోషంగా ఉన్నారని, తెలంగాణ తల్లికి మట్టి గాజులే ఉంటాయి, ఆభరణాలు ఉండవన్నారు. కవిత మాటలు మరోలా ఉన్నాయన్నారు. అందుకే తెలంగాణ తల్లిలో బీదరికం కనిపిస్తోందన్నారు.కేసీఆర్ ఆనాడు ఏర్పాటు చేసిన విగ్రహం కేవలం శ్రామికవర్గానికి సంబంధం లేకుండా ఉందంటూ అభ్యంతరాలు వచ్చాయన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో కేసీఆర్ అధికారికంగా జీవోలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్లలో అసెంబ్లీ అంటే ఫామ్‌హౌజ్, సెక్రటేరియేట్ అంటే ప్రగతి భవన్‌గా భావించిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తెలంగాణ తల్లి విగ్రహాన్ని గాంధీభవన్ తరలిస్తామని నేతలు చెప్పడంపై మండిపడ్డారు యెన్నం శ్రీనివాస్ రెడ్డి.

చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు

ప్రభుత్వం స్పందించకుంటే కోర్టును ఆశ్రయిస్తా

5 కంపెనీలపై హైడ్రా కమిషనర్‌కు కాటిపల్లి ఫిర్యాదు

హైదరాబాద్,డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఈరోజు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో కలిశారు. చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్న పలు కంపెనీలపై ఆయన ఫిర్యాదు చేశారు. ఆయా కంపెనీల పేర్లు ఏమిటో కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... ఈ అక్రమ నిర్మాణానికి సంబంధించి రెండు నెలల క్రితమే తాను మాట్లాడానని వెల్లడించారు. దీనిపై ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకుంటే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. రెండు నెలల క్రితం తాను మాట్లాడానని, ఆ తర్వాత పది రోజులకు... అనుమతులు ఇచ్చిన నిర్మాణాల జోలికి వెళ్లబోమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేశారని గుర్తు చేశారు.కానీ చెరువులను కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తాను ఫిర్యాదు చేసిన ఐదు కంపెనీలకు అనుమతులు ఇచ్చిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం... గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కొత్త నాటకానికి తెరలేపిందని విమర్శించారు.అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ఈ ఐదు సంస్థలకు సంబంధించి అనుమతులిచ్చిన అధికారులు, అండగా ఉన్న ప్రభుత్వ పెద్దలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూఆక్రమణలను అరికట్టేందుకు కొత్త చట్టాన్ని తీసుకురావాల్సి ఉందన్నారు.

కాంగ్రెస్ వాళ్లు తెలంగాణ ద్రోహులు

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శ

హైదరాబాద్,డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ సంస్కృతిపై మరోసారి దాడి చేసే ప్రయత్నం జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. నిన్న విజయోత్సవాల్లో తెలంగాణ సంస్కృతి కనిపించలేదన్నారు. నిన్న కనీసం ఏ ఒక్కరిలోనైనా ఉద్యమ భావోద్వేగాలు కనిపించాయా? ఈ సంబరాల్లో ఎవరైనా జై తెలంగాణ అని నినదించారా? అని ప్రశ్నించారు. ద్రోహుల చెంత చేరి తెలంగాణ తల్లికి మోసం చేయవద్దన్నారు. పార్టీ గుర్తు ప్రచారం కోసం కాంగ్రెస్ తల్లిని ఆవిష్కరించారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వాళ్లు తెలంగాణ ద్రోహులు... తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడమనే సామెతకు వారసులని జగదీశ్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా అక్కడ పెట్టిన పాట ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ వారిని నిలువెత్తున చీల్చినా... వారి రక్తంలో ఎక్కడా తెలంగాణ ఆత్మ కనిపించదన్నారు.తెలంగాణ చరిత్రను పాతాళానికి తొక్కేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ యాసను విలన్ భాషలా... 'తెలంగాణ' అంటేనే అసహ్యించుకునే శాసనసభలో 'తెలంగాణ' అనే మాటనే నిషేధించే స్థాయికి వెళ్లారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అప్పట్లో ఏదో మత్తులో పడి తెలంగాణను ఏపీలో కలిపారని, ఇప్పుడు కూడా పనరులను దోచుకునే మత్తులో పడి తెలంగాణను నామరూపాలు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాన్నారు.

అందరికీ కనిపించేలా ఉపాధ్యాయుల ఫొటోలు

విద్యాసంస్థలకు రాష్ట్ర సర్కార్ కీలక ప్రకటన జారీ

హైదరాబాద్, డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): తెలం గాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్, తెలంగాణ గురుకుల విద్యాసంస్థలకు రాష్ట్ర సర్కార్ కీలక ప్రకటన జారీ చేసింది. ఆయా పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల ఫొటోలను అందరికీ కనిపించే విధంగా బడుల్లో ప్రదర్శించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే కొన్ని పాఠశాలల్లో ప్రభుత్వం నియమించిన టీచర్ల స్థానంలో ఇతర ప్రైవేట్ వ్యక్తులు పనిచేస్తున్నారని విద్యాశాఖకు ఫిర్యాదులు అందాయని. ఇలా ఒకరికి బదులు మరొకరు పనిచేస్తు న్నట్లు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ఇప్పటికే అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తమ ఫొటోలను ఆయా పాఠశాలల్లో ప్రదర్శించాలని కేంద్ర విద్యాశాఖ పలుమార్లు ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కూడా పాఠశాలల్లో టీచర్ల ఫొటోలు ప్రదర్శించాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఖమ్మం జిల్లాలోని కొన్ని మారుమూల ప్రాంతాల్లో కొందరు సీనియర్ టీచర్లు ఆయా గ్రామాలకు చెందిన యువతీ యువకులకు రూ.10 వేల వరకు ఇచ్చి, వారిని బోధకులుగా నియమించినట్లు తమ దృష్టికి వచ్చిందని.. ఇదే తరహాలో హైదరాబాద్‌తోపాటు మరికొన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులకు ఇతర డ్యూటీ (ఓడీ) సౌకర్యం లేకున్నా పాఠశాలలకు నెలల తరబడి హాజరు కావడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో ఇదే మాదిరి ప్రైవేట్ వ్యక్తులు టీచర్లుగా పనిచేస్తున్నట్లు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ విధమైన తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, తప్పనిసరిగా అన్ని పాఠశాలలు తమ ప్రాంగణాల్లో అక్కడ పనిచేసే టీచర్ల ఫొటోలను ప్రదర్శించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఎమ్మెస్సీ యోగా ప్రవేశాల గడువును పెంపొందిస్తూ ప్రకటన జారీ అయ్యింది. ఎమ్మెస్సీ యోగా మొదటి ఏడాది, డిప్లొమా ఇన్ యోగాలో చేరేందుకు డిసెంబరు 16 వరకు గడువు పెంచినట్లు వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జాన్సన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ రెండో ఏడాదిలో చేరేందుకు పీజీ డిప్లొమా పూర్తి చేయాలన్నారు. ఇతర వివరాలను ఏఎన్‌యూ అధికారిక వెబ్‌సైట్ లో ఉంచామని జాన్సన్ వెల్లడించారు.

కేసీఆర్ పాలనలో 70 ఏళ్లు వెనక్కి

ఎన్ని ఇబ్బందులొచ్చినా ప్రజావాణి కొనసాగిస్తాం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమాన్ని భవిష్యత్తులో మరింత మెరుగుపరుస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేసిన ఏడాది పూర్తయిన సందర్భంగా లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. వారి నుంచి పలు సూచనలు స్వీకరించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం 70 ఏళ్ల వెనక్కి పోయిందని.. భట్టి విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని భట్టి వివరించారు. అధికారంలో వచ్చిన వెంటనే ప్రజావాణి ఏర్పాటు చేశామని.. నిరంతర పర్యవేక్షణతో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతుందని భట్టి అన్నారు. అదిలాబాద్‌లో పోడు భూముల పట్టాలకు పరిష్కారం తమ ప్రభుత్వం చూపిందన్నారు. అటవీ ప్రాంతాల్లో నివసించే వారికి సోలార్ పవర్ ఇస్తాం అని భట్టి పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం తమ ప్రభుత్వం పని చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజా వాణి మొదలై నేటికీ ఏడాది పూర్తయింది. ఏడాది కాలంలో అనేక సమస్యలకు పరిష్కారం చూపిన ప్రజావాణి.. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో సమస్యలకు పరిష్కారం చూపింది. ఏ శాఖలో సమస్య ఉన్న ప్రజావాణి పరిష్కారం చూపుతుందన్నారు. ఆరోగ్య సమస్యలకు కూడా ప్రజావాణి ద్వారా సంబధిత హాస్పటల్‌కి పంపి చికిత్స చేసుకోవచ్చన్నారు. స్కాలర్షిప్ సమస్యలను ప్రజావాణి తీర్చిందని భట్టి తెలిపారు. గల్ఫ్ కార్మిక బాధితులకు ప్రజావాణి ద్వారా సహాయం అందిందన్నారు.

ఈనెల 17న తెలంగాణకు రాష్ట్రపతి

17 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోనే

హైదరాబాద్,డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): ఈ నెల 17 నుంచి తెలంగాణలో రాష్ట్రపతి పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఈ నెల 17 నుంచి 21 వరకు రాష్ట్రపతి హైదరాబాద్‌లో ఉంటారని సీఎస్ తెలిపారు. రాష్ట్రపతి పర్యటనను సంతృప్తికరంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. తగిన రీతిలో విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను శాంతికుమారి ఆదేశించారు. పాములు పట్టేవారిని నియమించి పాము పట్టే పనిని ముందుగానే పూర్తి చేయాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. రాష్ట్రపతి నిలయంలో 24 గంటలూ పాములు పట్టే బృందాన్ని ఏర్పాటు చేయాలని సీఎస్ ఆదేశించారు. అలాగే, కోతుల బెడదను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలన్నారు. తేనెటీగలను పట్టుకోవడం ముందుగానే జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్రపతి నిలయం సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని, జారీ చేసినవన్నీ ముందుగానే పరిష్కరించేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. పోలీసు శాఖ తగిన భద్రతా ఏర్పాట్లు, సరైన ట్రాఫిక్, బందోబస్తు ప్రణాళికను రూపొందించాలని సూచించారు. అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని కోరారు. వైద్యారోగ్యశాఖ సహాయక సిబ్బందితోపాటు అర్హులైన వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

సిద్దిపేటలో శ్రీవారి ఆలయం నిర్మించండి

టీటీడీ చైర్మన్‌కు హరీష్‌రావు వినతి

హైదరాబాద్,డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): తెలుగు ప్రజలంతా కలియుగ ప్రత్యక్ష దైవంగా కొలిచే తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం.. త్వరలోనే సిద్దిపేట లో కొలువు దీరనుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. మంగళవారం (డిసెంబర్ 09న) తిరుపతి వెళ్లిన హరీశ్ రావు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని కలిశారు. సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణం చేపట్టాలని కోరారు. వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం కోమటి చెరువు ప్రాంతంలో ఇప్పటికే.. 5 ఎకరాల 10 గుంటల స్థలాన్ని మంజూరు చేశామని టీటీడీ ఛైర్మన్‌తో హరీశ్‌రావు తెలిపారు. గతంలోనే టీటీడీకి చెందిన ఇంజనీరింగ్ అధికారులు కోమటి చెరువు ప్రాంతంలో పర్యటించి ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారని బీఆర్ నాయుడికి తెలిపారు. అందులు అనుగుణంగానే ఆలయ నిర్మాణ నమునా, డిజైన్లను కూడా రూపొందించారని వివరించారు. తిరుపతి వెంకటేశ్వర స్వామిని తెలుగు ప్రజలంతా ఎంతో ఇష్టంగా కొలుస్తారని.. ఇలవేల్పుగా భావిస్తారని తెలిపారు. అలాంటి శ్రీవారి ఆలయం సిద్దిపేటలో నిర్మించడం గొప్ప అదృష్టమని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు.వచ్చే టీటీడీ బోర్డు మీటింగ్‌లో సిద్దిపేటలో వెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి ఆమోదం తెలిపేలా చొరవ తీసుకోవాలని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు. కాగా.. ఆలయ నిర్మాణ పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా బీఆర్ నాయుడినే రావాల్సిందిగా హరీష్ రావు కోరారు. అందుకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించారు. వెంటనే చీఫ్ ఇంజనీర్ అధికారి, సంబంధిత అధికారులను పిలిచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో.. సిద్దిపేటలో త్వరలోనే.. తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడు కొలువుదీరనున్నాడన్న మాట.కాగా.. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో.. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తిరుమలేశుని దేవాలయాలు నిర్మించటమే కాకుండా పాడుబడిపోతున్న ప్రముఖ పుణ్యక్షేత్రాలను పునరుద్ధరించే బృహత్కార్యాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే.. సిద్దిపేటలో కూడా టీటీడీ ఆలయాన్ని నిర్మించేందుకు గతంలోనే ప్రతిపాదన చేశారు. అందుకు కావాల్సిన స్థలాన్ని కూడా కేటాయించటం.. దాన్ని టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించటం, డిజైన్లు కూడా

మరోసారి హస్తినకు రేవంత్

పలువురు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం

హైదరాబాద్,డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. ఈసారి ఒంటరిగా కాకుండా.. కుటుంబ సమేతంగా హస్తినకు వెళ్తన్నారు రేవంత్ రెడ్డి. మొదట ఢిల్లీకి వెళ్లి.. అటు నుంచి రాజస్థాన్‌లోని జైపూర్‌కు వెళ్లనున్నారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో సీఎం రేవంత్ రెడ్డి.. అక్కడే ఉండనున్నట్టు అధికారిక వర్గాలు తెలిపారు. కాగా.. మంగళవారం సాయంత్రమే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీకి పయనం కానున్నారు. అక్కడి నుంచి జైపూర్‌కు వెళ్లనున్నారు. జైపూర్‌లో తమ బంధువుల వివాహ వేడుక ఉండగా.. దానికి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా హాజరుకానున్నారు. జైపూర్‌లో వివాహ కార్యక్రమానంతరం.. రేవంత్ రెడ్డి మళ్లీ ఢిల్లీకి చేరుకోనున్నట్టు తెలుస్తోంది. ఓవైపు.. బంధువుల పెళ్లికి హాజరవటమే కాకుండా.. మరోవైపు రాజకీయ వ్యవహారాల్లో కూడా రేవంత్ రెడ్డి పాల్గొననున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో.. పలువురు కేంద్ర మంత్రులను కలిసేందుకు ఇప్పటికే రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్లు కూడా తీసుకున్నట్టు సమాచారం. వివిధ పథకాల కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఆయా శాఖల నుంచి గ్రాంట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రులను కోరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు.. ఈ మూడు రోజుల పర్యటనలో భాగంగానే.. సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీ నేతలతో కూడా భేటీ అయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

చెత్త పన్ను వేసినా.. తొలగించలే

విద్యుత్ ప్లాంట్ల నిర్లక్ష్యంతో తగ్గిన ఉత్పత్తి

జిందాల్ ప్లాంట్‌ను

పరిశీలించిన మంత్రి నారాయణ

పల్నాడు,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): గత ప్రభుత్వం చెత్తపన్ను వేసినా, చెత్తను తొలగించలేదని, చెత్త రీసైక్లింగ్ చేపట్టలేదని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌లను వదిలేసిందని మంత్రి నారాయణ అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 2014 నుంచి 2019 మధ్య చాలా స్టడీ చేసిన తర్వాత వేస్ట్‌తో విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. మంగళవారం జీఎంసీ పరిధిలోని జిందాల్ ప్రాజెక్టును మంత్రి నారాయణ పరిశీలించారు. మంత్రి నారాయణ తో పాటు ప్రాజెక్టును ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు , స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాబి పరిశీలించారు. మంత్రి నారాయణకు జిందాల్ పవర్ ప్లాంట్ పనులను అధికారులు వివరించారు. ప్లాంట్ నిర్వహణ, ఇతర వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే మూడేళ్ల లో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన వంద శాతం పూర్తి చేస్తామని చెప్పారు. '2014-19 మధ్య చాలా అధ్యయనం తర్వాత ప్లాంట్ నిర్ధయించాం. వైకాపా ప్రభుత్వం విద్యుదుత్పత్తి ప్లాంట్‌లను వదిలేసింది. 7 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ నుంచి చెత్తను తరలిస్తున్నారు. 6890 మెట్రిక్ టన్నుల చెత్తలో 2,500 టన్నులను విద్యుత్‌గా మారుస్తున్నారు. కాకినాడ, నెల్లూరులో త్వరలో ఏర్పాటు చేస్తాం. చెత్త పన్ను తప్ప.. చెత్తను ఎలా నిర్వహించాలో గత ప్రభుత్వానికి తెలియదు. చట్ట సవరణ చేసి మరీ చెత్త పన్ను తొలగించాం' అని మంత్రి అన్నారు. 16 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ నిర్మించినట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌తో ప్రజలకు ఎంతో మేలని పేర్కొన్నారు. విదేశీ సాంకేతికతను పరిశీలించాకే నారాయణ ఈ ప్లాంట్ నిర్మాణం చేయించారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి చెప్పారు. ప్లాంట్ నిర్వహణ, ఇతర వివరాలు అడిగి మంత్రి నారాయణ తెలుసుకున్నారు. 6890 మెట్రిక్ టన్నుల చెత్తలో 2500 టన్నుల చెత్తను విద్యుత్‌గా మారుస్తున్నారని తెలిపారు. చెత్త పన్ను వేయడం తప్ప చెత్తను ఎలా ఉపయోగించుకోవాలలో వైసీపీ ప్రభుత్వానికి తెలియదని అన్నారు. చెత్త పన్ను తీసేశాం.. చట్ట సవరణ చేసి మరీ చెత్త పన్ను తొలగించామని చెప్పారు. అమృత్ పథకానికి వైసీపీ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో పథకం కింద ఇచ్చే నిధులు ఉపయోగించలేకపోయామని అన్నారు. టన్ను చెత్తను ట్రీట్ చేయాలంటే రూ.500 నుంచి రూ.750లు ఖర్చవుతుందని.. ఆ ఖర్చు తగ్గించాలంటే చెత్త తరలించడమే మార్గమని మంత్రి నారాయణ అన్నారు. జిందాల్ ప్లాంట్ ఏర్పాటులో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ కృషి ఎంతో ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ తెలిపారు. విదేశాల్లో ఉన్న సాంకేతికను పరిశీలించిన తర్వాత నారాయణ జిందాల్ ఎ÷-లాంట్ నిర్మాణం చేయించారని అన్నారు. చుట్టు పక్కల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఈ ప్లాంట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో ఇటువంటి ప్లాంట్లులు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఉన్నామని అన్నారు. జగన్ ప్రభుత్వం 85 వేల టన్నుల చెత్తను ప్రజల నెత్తిన వేసి వెళ్లిందని చెప్పారు. ఏపీని ఘన వ్యర్థాల ట్రీట్‌మెంట్‌లో ఒక మోడల్‌గా తీర్చిదిద్దుతామని కొమ్మారెడ్డి పట్టాభి రామ్ అన్నారు. 16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో జిందాల్ ప్లాంట్ నిర్మాణం చేశారని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.

స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై

ముసుగు తీయండి: వైఎస్ షర్మిల

అమరావతి, డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి చేసిన వ్యాఖ్యలు మరోసారి రాష్ట్ర ప్రజలను అవమానించినట్లే అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. ఎక్స్ వేదికగా షర్మిల స్పందిస్తూ.. అసలు ప్లాంట్ ప్రతిపాదనే తమ దగ్గర లేదని అపహాస్యం చేసినట్లు మాట్లాడటం నిజంగా సిగ్గుచేటన్నారు. ప్రతిపాదన వస్తే ఆలోచన చేస్తామని చెప్పడం ఏపీ రాష్ట్ర ప్రయోజనాలతో బీజేఎ చెలగాటం ఆడుతోందనడాని నిదర్శమన్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ఎంపీలు మౌనంగా ఉండటం వారి చేతకాని తనానికి అద్దం పడుతుందని విమర్శించారు. కడప ఉక్కు సీమ ప్రజల హక్కు అని.. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రమే ఆధ్వర్యంలో నిర్మించి ఇచ్చేలా కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని.. విభజన చట్టంలోనూ పెట్టిందన్నారు. అనంతరం అధికారంలోకొచ్చిన బీజేపీ సర్కార్ విభజన హామీలను కాల రానిందని విమర్శించారు. సీమ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని మండిపడ్డారు. కడప ప్రజలకు తీరని ద్రోహం చేసిందన్నారు. తిరుపతి వేదికగా కడప స్టీల్‌పై ప్రధాన మోదీ హామీ ఇచ్చారని.. ఆ తరువాత సాధ్యం కాదని, సొంత గనులు లేకుండా కష్టమని, లాభదాయకంగా లేదని సన్నాయి నొక్కులు నొక్కారని వ్యాఖ్యలు చేశారు. "ముఖ్యమంత్రి చంద్రబాబును సూటిగా ప్రశ్నిస్తున్నాం. కడప స్టీల్‌పై మీ వైఖరి ఏంటి? కేంద్ర ఉక్కుశాఖ మంత్రి ప్రకటనకు మీరిచ్చే సమాధానం ఏంటి? అసలు కేంద్రం పరిశీలనలో లేదనడం మీరు సమర్థిస్తారా ? కడప స్టీల్ ప్లాంట్ కడతారా ? కట్టరా? ఇప్పటికైనా స్టీల్ ప్లాంట్‌పై మీ ముసుగు తీయండి సార్. అనాడు బీజేపీ మోసం చేసిందని, కేంద్రం సహకరించక పోయినా.. రాష్ట్ర ప్రభుత్వమే ప్లాంట్ కడుతుందని ఒకసారి మీరు కొబ్బరి కాయ కొడితే... రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యం ఉండాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ రెండు సార్లు టెంకాయలు కొట్టారు. నాలుగు సార్లు శంకుస్థాపన జరిగి ఒక్క అంగుళం కూడా ముందుకు కదలని ప్రాజెక్టు ప్రపంచంలో ఏదైనా ఉందంటే అది కడప స్టీల్ మాత్రమే" అని అన్నారు. "కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారంలో ఉందంటే మీ మద్దతుతోనే. మీకు రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం అనుకుంటే, మోడీ ఇచ్చిన పదవులు ముఖ్యం కాకపోతే, విభజన హక్కు ప్రకారం కడప స్టీల్‌ను కేంద్రం నిర్మించి ఇచ్చేలా ప్రకటన చేయించండి. లేకుంటే భేషరతుగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి బీజేపీకి ఇచ్చిన మద్దతు ఉపసంహరించుకోండి. కేంద్రం సహాయం లేకుండా రాష్ట్రమే నిర్మించే పనికి మోడీకి భజన చేయాల్సిన అవసరం ఉందా.. తేల్చుకోండి" అంటూ వైఎస్ షర్మిల ఎక్స్‌లో పోస్టు చేశారు.

పవన్‌కళ్యాణ్ బెదిరింపుకాల్స్ నిందితుడి అరెస్టు

అమరావతి, డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ రావడం కలకలం రేపింది. పవన్‌ను చంపేస్తామని హెచ్చరిస్తూ గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్, అభ్యంతరకర భాషతో సందేశాలు రావడంతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. రంగంలోకి దిగిన పోలీసులు పురోగతి సాధించారు. ఫోన్ కాల్స్ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నూక మల్లికార్జున్ అని, మానసిక స్థితి సరిగ్గా లేదని, మద్యం మత్తులో బెదిరింపు కాల్స్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకున్న నిందితుడిని విజయవాడ పోలీసులు విచారిస్తున్నారు. గతంలో వైజాగ్‌లో నూక మల్లికార్జున్‌పై 354 కేసు నమోదైంది.

బాబు క్యాబినెట్‌లోకి నాగబాబు

నాగబాబుకు మంత్రి పదవి.. త్వరలోనే అధికారికంగా ప్రకటన

అమరావతి,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నటుడు నాగబాబును రాజ్యసభకు పంపుతారనే ప్రచారం ఇటీవల జోరుగా సాగింది. రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు స్థానాల్లో ఒకటి నాగబాబుకు ఇస్తారని ఊహాగానాలు వెలువడ్డాయి. కానీ, మూడు సీట్లకు వేరే అభ్యర్థులను ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయనకు మంత్రి పదవి దక్కనున్నట్లు తెలిసింది. నాగబాబును మంత్రివర్గంలోకి చంద్రబాబు తీసుకోనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఏపీలో ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం 25 మందిని క్యాబినెట్‌లోకి తీసుకొవచ్చు. ప్రస్తుతం 24 మంది మంత్రులు ఉన్నారు. ఇందులో జనసేన నుంచి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, బీజేపీ నుంచి ఒకరికి మంత్రిగా అవకాశం దక్కింది. ఇప్పుడు ఏపీ క్యాబినెట్‌లోకి నాగబాబును కూడా తీసుకోనున్నట్లు సమాచారం. మిగిలిన ఆ ఒక్క మంత్రి పదవిని నాగబాబుకు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనిపై త్వరలోనే అధికార ప్రకటన రానున్నట్లు సమాచారం.

ఏపీ హైకోర్టులో సజ్జలకు ఊరట

ముందస్తు బెయిల్ కోరుతూ ఏపీ హైకోర్టును ఆశ్రయించిన సజ్జల

సజ్జలపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దన్న ఉన్నత న్యాయస్థానం

గతంలో ఇచ్చిన ఆదేశాలు పొడిగింపు

అమరావతి,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ అగ్రనేత సజ్జల రామకృష్ణారెడ్డికి ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. సజ్జల రామకృష్ణారెడ్డిపై మరో రెండు వారాల పాటు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ కేసులో సజ్జల ముందస్తు బెయిల్ కోరుతూ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమను వేధిస్తున్నారని సజ్జల ఆరోపించారు. ముఖ్యంగా, తనపై 41ఏ నోటీసులకు అవకాశం లేని సెక్షన్లతో కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని వివరించారు. అందుకే తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని సజ్జల కోర్టును కోరారు. ఈ పిటిషన్ పై ఉన్నత న్యాయస్థానం నేడు విచారణ చేపట్టింది. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు... గతంలో ఇచ్చిన ఆదేశాలను మరో రెండు వారాలు పొడిగించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

రాంగోపాల్‌వర్మకు ఏపీ హైకోర్టులో ఊరట

షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు

దర్యాప్తుకు సహకరించాలని ఆదేశం

అమరావతి,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): రాంగోపాల్ వర్మకు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కాగా దర్యాప్తునకు సహకరించాలని, పోలీసులు కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని రాంగోపాల్ వర్మను ఆదేశించింది. సోషల్ మీడియాలో చంద్రబాబు, పవన్, లోకేశ్?పై అసభ్యకర పోస్టులపై కేసుకు సంబంధించిన పిటిషన్?పై ఏపీ హైకోర్టు ఇవాళ విచారణ చేపట్టింది. ఈ మేరకు వర్మకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ షురూ..

ఏఐ, డీప్ టెక్‌లతో పౌర సేవలు నిర్వహణ

అమరావతి,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): అందుబాటు లోకి వస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధం అన్న విషయం అందరికీ తెలిసిందే. ఆ కోవకే చెందిన వార్త ఇది. ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వాట్సాప్ ద్వారా పౌర సేవలు వేగంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. మనం ప్రతీ సమాచారాన్ని పొందడానికి, చేరవేయడానికి వాట్సాప్‌ను ఎలా వినియోగిస్తున్నామో, ఇక ప్రభుత్వం కూడా మనకు అవసరమైన సేవలు వాట్సాప్‌లో అందిం చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ఇకపై వచ్చేదంతా వాట్సాప్ గవర్నెన్స్ అంటూ తాజాగా ప్రకటించింది కూడా. పాలనలో మరింతగా సాంకేతికత వినియోగం అవసర మని, విభాగాల వారీగా రియల్‌టైమ్ డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ ఆ పర్యవేక్షణ బాధ్యతలను ఆర్టీజీఎస్‌కు అప్పగించింది రాష్ట్ర ప్రభుత్వం. సమర్థవం తమైన పాలన అందించేలా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని, రియల్‌టైమ్‌లో సమాచారాన్ని సేకరించి మిగిలిన శాఖలతో అనుసంధానం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల సమాచారాన్ని ఆర్టీజీఎస్ సమీకృతం చేసి, మొత్తంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని కూడా బాధ్యతలు ఫిక్స్ చేసారు. మొదటగా ప్రతిశాఖలో సమాచార సేకరణ జరగా లని, తర్వాత ఆ సమాచారాన్ని సమీకృతం చేసుకోవాలని.. అంతిమంగా 'వాట్సాప్ గవర్నెన్స్' ద్వారా అత్యుత్తమ సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. మంగళవారం సచివాలయంలో సీఎంతో సహా ఆర్టీజీఎస్‌కు చెందిన అధికారులతో జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. కుల ధృవీకరణ దగ్గర నుంచి ఆదాయ ధృవీకరణ పత్రం, ఇతర ధృవపత్రాలను పొందేందుకు వాట్సప్‌ను వేదిక చేసుకునేలా వ్యవస్థను రూపొందించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వేగంగా పరిష్కరించా లన్నది ప్రభుత్వ ఆలోచన. వినతుల పరిష్కార విధానం, ప్రజల సంతృప్తి స్థాయి కూడా ఆర్టీజీఎస్ పరిశీలించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. డ్రోన్లు, సీసీ కెమేరాలు, శాటిలైట్లు, ఐవోటీ డివైజ్‌ల ద్వారా సేకరిస్తున్న విజువల్స్‌ను కూడా సమీకృతం చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇటీవల గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించిన గంజాయి తోటలను డ్రోన్ల సాయంతో ధృవీకరించుకోవడం జరిగిందని.. అలాగే రానున్న రోజుల్లో పంట తెగుళ్లను గుర్తించి, రైతులను అప్రమత్తం చేసేందుకు డ్రోన్లు వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే రాష్ట్రంలోని రహదారులపై జరుగుతున్న ప్రమాదాల కు గల కారణాలను అన్వేషించేందుకు డ్రోన్ల ద్వారా ప్రమాద స్థలాలను గుర్తించి పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా చేపట్టిన అభిప్రాయ సేకరణలో నాణ్యతకు తగ్గ ధర, 48 గంటల్లో డబ్బులు జమ చేయడం, రవాణా సౌకర్యం, గోనె సంచుల లభ్యతపై 90 శాతానికి పైగా రైతులు తమ సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. సంతృప్తి స్థాయి తెలుసుకోవడం ద్వారా మరింత మెరుగ్గా సేవలు అందించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. ఒకవేళ ఎక్కడైనా అసంతృప్తి ఉంటే..ఎందుకు వ్యక్తమవుతోందనే దానిని పరిశీలించి తక్షణం ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సమాచార ప్రామాణికతను విశ్లేషించి, అవసరమైతే తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చివరి దశకు వచ్చిందని, ఇప్పటికే 95 శాతం కుటుంబాల జియో ట్యాగింగ్ పూర్తిచేశామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ట్యాగింగ్ సక్రమంగా జరిగిందా? లేదా? అనేది సరిచూసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఆధార్ సంబంధిత సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన మరో వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలుకు సంబంధించిన రూ.20 కోట్ల నిధుల మంజూరుకు సీఎం అనుమతిచ్చారు.

నిర్మాణాలకు సీఆర్‌డీఏ

తొలి ఆమోదం

అమరావతిపై చంద్రబాబు

సర్కార్ ఫుల్ ఫోకస్

నిర్మాణ పనులకు

11 వేల 467 కోట్లు విడుదల

అమరావతి, డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే అమరావతి కొత్త ఊపరి పోసుకుంది. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత అమరావతి సహా పోలవరంపై ప్రత్యేకం గా దృష్టి సారించింది ప్రభుత్వం. ఈ క్రమంలో అమరావతిలో నిర్మాణాలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్న ప్రభుత్వం.. నిధులు సమకూర్చడంపై ఫోకస్ పెట్టింది. నిర్మాణాలకు సంబం ధించితాజాగా ముందుడుగు పడింది. సీఆర్‌డీఏ ఆమోదించిన 20 సివిల్ పనులను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉ త్తర్వులు జారీ చేసింది. ఈ పనులకు 11 వేల 467 కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని స్పష్టం చేసింది. ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ సంయుక్తంగా ఇవ్వనున్న రుణంతో ఈ పనులు చేపట్టేలా కార్యాచరణ సిద్ధమౌ తుంది. ప్రభుత్వం ఆమోదించిన పను ల్లో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు, ఉద్యోగుల నివాస అపార్ట్‌మెంట్లు, ఐఎఎస్ అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసాల నిర్మాణాలు ఉన్నాయి. న్యాయ మూర్తులు, మంత్రులు, సీనియర్ ఐఎ ఎస్ అధికారుల బంగ్లాల నిర్మాణం కోసం నిధుల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా సచివాలయ టవర్లు, అసెంబ్లీ, రాజధాని పరిధిలో మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం నిధులను వెచ్చించాలని నిర్ణయించింది. హ్యాపీనెస్ట్ ప్రాజెక్ట్‌లో భాగంగా 1200 ఫ్లాట్స్‌తో నిర్మించనున్న12 టవర్ల నిర్మాణానికి 984 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుంది ప్రభుత్వం. అమరావ తిలో కొండవీటి వాగు, పాలవాగును వెడల్పు చేయటంతో పాటు శాఖమూరు, నీరు కొండ దగ్గర రిజర్వాయర్ నిర్మాణం కోసం 1585 కోట్ల రూపాయలు వెచ్చిం చనుంది.రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ లే అవుట్‌లలో రోడ్లు, మౌలిక వసతుల కోసం ఇప్పటికే 3,859 కోట్లు కేటా యించింది ప్రభుత్వం. జనవరిలో పను లు ప్రారంభించి, మూడేళ్లలో అమరావ తి నిర్మాణం పూర్తి చేసేలా అడుగులు వేస్తోంది. అమరావతి అభివృద్ధిలో భాగంగా తొలిదశలో 15 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్ట నున్నారు. అత్యున్నత ప్రమాణాలతో అమరావతిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తారు స్వచ్ఛమైన నీటి సరఫరా వ్యవస్థ, రోడ్లు, పార్కులు, హరిత నిర్మాణాలు చేపడుతారు. అత్యున్నత ప్రమాణాలతో ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

తలుపులు మూసేసి రాష్ట్ర విభజన

పవన్ కళ్యాణ్‌కు రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి లేఖ

అమరావతి,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను పార్లమెంట్‌లో తలుపులు మూసేసి చేశారన్న ఉండవల్లి అరుణ్ కుమార్.. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై తాను పదేళ్లుగా పోరాడుతూనే ఉన్నానని చెప్పారు. ఈ విషయమై సుప్రీంకోర్టులో తాను పిటిషన్ వేస్తే.. కేంద్రం ఇన్నేళ్లయినా కౌంటర్ దాఖలు చేయలేదని చెప్పారు. అలాగే ఎన్డీఏ ప్రభుత్వంలో కీలకంగా ఉన్నందున పవన్ కళ్యాణ్ ఆ బాధ్యత తీసుకోవాలని.. రాష్ట్రం నుంచి కూడా అఫిడవిట్ దాఖలు చేయాలని ఉండవల్లి సూచించారు.ఈ విషయంలో తాను సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ పదేళ్లుగా నడుస్తూనే ఉందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ కనీసం కౌంటర్ దాఖలు చేయలేదన్నారు. అలాగే కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ. 74542 కోట్లు బకాయిలు రావాలని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తేల్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత 2018లో అప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడు కలిసి ఈ విషయమై చర్చించానని.. దీనిపై లోక్ సభలో చర్చించేందుకు నోటీసు ఇవ్వాలని, సుప్రీంకోర్టులో రాష్ట్రం తరుపున అఫిడవిట్ దాఖలు చేయాలని చంద్రబాబు నిర్ణయించారని చెప్పారు. 2019లో విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మనకు జరిగిన అన్యాయంమై పార్లమెంటులో చర్చించాలని, సుప్రీంకోర్టులో ప్రస్తావించాలని తీర్మానించామని.. కానీ నాటి ఎన్నికల్లో వైసీపీ గెలిచిందని ఉండవల్లి అరుణ్ కుమార్ లేఖలో పేర్కొన్నారు. ఏపీకి జరిగిన అన్యాయంపై సుప్రీంకోర్టులో రాష్ట్రం తరుపున అఫిడవిట్ దాఖలు చేయాలని.. ఆ తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా తాను లేఖ రాశానని కానీ తనకు ఎలాంటి సమాధానం రాలేదని ఉండవల్లి పేర్కొన్నారు.

శ్రీశైలంలో స్వామివారి దర్శనవేళల్లో మార్పులు

అమరావతి, డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): శ్రీశైలం మల్లన్న భక్తులకు దేవస్థానం శుభవార్త చెప్పిం ది. శ్రీశైలం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి దర్శనవేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. మామూలుగా శ్రీశైలం వెళ్లే భక్తులకు స్వామివారి స్పర్శ దర్శన భాగ్యం కల్పిస్తుంటారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుంటారు. అయితే స్వామి వారి స్పర్శ దర్శనంపై ఈవో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ఎప్పుడూ కూడా స్వామి వారి స్పర్శ దర్శనం కలిగేలా నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైలంకు వచ్చిన భక్తులు స్వామి వారి స్పర్శ దర్శనం కల్పించే వెసులుబాటును కల్పించారు నూతన ఈవో. శ్రీశైలం ఆలయ దర్శన వేళల్లో మార్పులు చేస్తూ ఈఓ శ్రీనివాసరావు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం మారిన వేళలను మీడియాకు తెలియజేశారు ఈవో. ఇకపై భక్తుల రద్దీ రోజుల్లోనూ స్పర్శ దర్శనం కల్పిస్తూ నూతన ఈవో ఎం.శ్రీనివాసరావు నిర్ణయం తీసుకున్నారు. గతంలో శని, ఆది, సోమవారాలు పర్వదినాలలో భక్తుల రద్దీ దృష్ట్యా స్పర్శదర్శనాలు, అభిషేకాలు నిలివేస్తూ దేవస్థానం ప్రకటించింది. అయితే స్పర్శ దర్శనాలు తరచూ భక్తులు అధికారులకు వినతి చేస్తూ వచ్చారు. భక్తుల విజ్ఞప్తి మేరకు దేవస్థానం వైదిక కమిటీ, అధికారులతో చర్చించి మాత్రమే ఈవో అవకాశం కల్పించారు.

నేను పార్టీలు మారడం లేదు..

పార్టీలే నా వద్దకు వస్తున్నాయి: ఆర్ కృష్ణయ్య

అమరావతి, డిసెంబర్10 (ఋషి ప్రతి నిధి): బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ పార్టీ తరుపున ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్. కృష్ణయ్య పోటీ చేస్తున్నారు. నామినేషన్ అనంతరం మీడి యాతో మాట్లాడిన ఆర్. కృష్ణయ్య.. బీసీ రిజ ర్వేషన్లపై చట్టసభల్లో పోరాటం చేస్తానన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీతోనే సాధ్యమన్నారు. బీసీల కోసం తాను చేస్తున్న సేవలను గుర్తించి బీజేపీ ఈ అవకాశం ఇచ్చిందన్నారు. మరో వైపు తాను పార్టీలు మారడం లేదన్న ఆర్. కృష్ణయ్య పార్టీలే తన వద్దకు వస్తున్నాయని అన్నారు. టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆర్. కృష్ణయ్య.. ఆ తర్వాతి కాలంలో వైసీపీలో చేరారు. వైసీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అయితే రాజ్యసభ సభ్యత్వా నికి రాజీనామా చేసిన కృష్ణయ్య.. ఇప్పుడు అదే స్థానికి బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు.

ట్రంప్ హెచ్చరికలకు చైనా దీటుగా సమాధానం

అమెరికా-చైనా మధ్య పన్నులు ఉండవు

టెక్ యుద్ధాల్లో విజేతలు ఎవరూ ఉండరు

తమ ప్రయోజనాలను రక్షించుకుంటామన్న జిన్‌పింగ్

న్యూఢిల్లీ,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలకు.. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. అమెరికా-చైనా వాణిజ్యం గురించి ప్రస్తావించిన ట్రంప్.. చైనా వస్తువులపై భారీగా పన్నులు వేస్తానంటూ పేర్కొన్నారు. అయితే తాజాగా ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన జిన్‌పింగ్ అమెరికా-చైనా మధ్య పన్నులు, టెక్ యుద్ధాల్లో విజేతలు ఎవరూ ఉండరని స్పష్టం చేశారు. అదే సమయంలో తమ చైనా ప్రయోజనాలను రక్షించుకుంటామని జిన్‌పింగ్ తేల్చి చెప్పారు.మరికొన్ని రోజుల్లో అమెరికా అధ్యక్షుడి కుర్చీలో కూర్చోనున్న రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్.. దౌత్యపరంగా, వాణిజ్యం సహా ఇతర రంగాల్లో అమెరికాతో వివిధ దేశాలకు ఉన్న సంబంధాలపై తన విజన్‌ను బయటపెడుతున్నారు. అయితే తాను అధికారంలోకి వస్తే.. కొన్ని దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై భారీగా ట్యాక్స్‌లు విధిస్తానని ఇప్పటికే ప్రకటించారు. ఇందులో భారత్, చైనాలు కూడా ఉన్నాయి. అయితే ఈ విషయంపై తాజాగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కౌంటర్ ఇచ్చారు. చైనా-అమెరికా మధ్య వాణిజ్య యుద్ధంలో విజేతలు ఉండరని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. ట్యాక్స్, టెక్ యుద్ధాల్లో ఎవరూ విజయం సాధించలేరని స్పష్టం చేశారు.పన్నుల యుద్ధం, వాణిజ్య యుద్ధం, టెక్నాలజీ వార్ అనేవి ఆర్థిక చట్టాలకు విరుద్ధంగా నడుస్తాయని.. ఇందులో ఎవరూ విజేతలు ఉండరని తాజాగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్నారు. వరల్డ్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి 10 అంతర్జాతీయ సంస్థల అధినేతలతో భేటీ అయిన జిన్‌పింగ్.. ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే తమ సొంత వ్యవహారాలతోపాటు అభివృద్ధి, భద్రత, సార్వభౌమాధికారాన్ని పరిరక్షించుకునేందుకు చైనా కట్టుబడి ఉన్నట్లు జిన్‌పింగ్ చెప్పారు. ఈ సందర్భంగా ప్రస్తుతం చైనాలో కొనసాగుతున్న ఆర్థిక మందగమనంపై స్పందించిన జిన్‌పింగ్.. ఈ సంవత్సరం 5 శాతం ఆర్థిక వృద్ధి సాధిస్తామనే లక్ష్యం అందుకుంటామని తేల్చి చెప్పారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో చైనా కీలక పాత్ర పోషించడం కొనసాగుతుందని ఈ సందర్భంగా జిన్‌పింగ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్న జిన్‌పింగ్.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు అన్ని దేశాలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. అయితే కొన్ని రోజుల క్రితం జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన డొనాల్డ్ ట్రంప్.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మాట్లాడినట్లు వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే జిన్‌పింగ్‌తో మాట్లాడానని.. ఆయన బాగా కలిసిపోయినట్లు ట్రంప్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. కానీ చైనా మాత్రం ఈ విషయాన్ని స్పష్టం చేయలేదు.అమెరికా ఎన్నికల ప్రచారంలోనే.. తాను అధికారంలోకి వస్తే చైనా ఎగుమతులపై 60 శాతం పన్నులు విధిస్తానని డొనాల్డ్ ట్రంప్ తేల్చి చెప్పారు. ఫెంటానిల్‌ను అరికట్టడంలో చైనా విఫలమైతే అదనంగా మరో 10 శాతం ట్యాక్స్‌లు వేస్తానని తీవ్ర హెచ్చరికలు చేశారు. ట్రంప్ వ్యాఖ్యలతో చైనా కూడా గట్టిగానే స్పందిస్తోంది. చట్టాన్ని ఉల్లంఘించి అమెరికాకు చెందిన చిప్ తయారీ సంస్థ ఎన్‌విడియాపై దర్యాప్తు చేయనున్నట్లు చైనా తాజాగా ప్రకటించింది. చైనా చిప్ తయారీ రంగంపై అమెరికా విధించిన ఆంక్షలకు ప్రతీకారంగానే చైనా ఈ చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.

పార్లమెంటులో కొనసాగుతున్న ప్రతిష్ఠంభన

ఉభయసభలు నేటికి వాయిదా

విపక్షాల తీరుపై స్పీకర్ ఓంబిర్లా అసహనం

రాజ్యసభలో ఛైర్మన్‌పై ఇండియా కూటమి అవిశ్వాసం

న్యూఢిల్లీ, డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): అదానీ ముడుపుల వ్యవహారంపై పార్లమెంటు దద్దరిల్లుతోంది. గత కొన్నిరోజులుగా జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో అదానీ ముడుపుల విషయం, మణిపూర్ సంక్షోభంపై చర్చ జరగాలని ప్రతిపక్ష ఎంపీలు ఉభయ సభల్లో పట్టుబడుతున్నారు. అయితే ఈ విషయాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధపడడం లేదు. దీంతో ఉభయసభలూ ప్రారంభమైన కొద్దిసేపటికే వాయిదా పడుతున్నాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కొద్దిసేపటికే ఉభయసభలు వాయిదాపడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన 6 నిమిషాలకే వాయిదాపడింది. సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. ఈ సందర్భంగా స్పీకర్ పార్లమెంటు గౌరవాన్ని కాపాడాలని అధికార, ప్రతిపక్ష ఎంపీలను కోరారు. సభలో ఎంపీలు పార్లమెంటు గౌరవాన్ని కాపాడేలా ప్రవర్తిస్తే.. ప్రజల్లోకి మంచి సందేశం వెళుతుంది అని ఆయన అన్నారు. పార్లమెంటులో విపక్షాల నిరసనలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తంచేశారు. 'మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం. ప్రజల ఆశలు, ఆకాంక్షలను మనం నెరవేర్చాలి. మనమందరం సభా గౌరవాన్ని కాపాడుకోవాలి. కానీ, గత కొన్ని రోజులుగా జరుగుతున్న సంఘటనలు బాగుండటం లేదు' అని ఆయన పేర్కొన్నారు. ఈక్రమంలోనే ఇరు సభలు రేపటికి వాయిదా పడ్డాయి. మరోవైపు సభ వాయిదా అనంతరం అదానీ వ్యవహారంపై కేంద్రప్రభుత్వం సమాధానం ఇవ్వాలని పార్లమెంటు వెలుపల ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేస్తూ నిరసన చేశారు. సభలు వాయిదాల పర్వం నేపథ్యంలో పార్లమెంటు సజావుగా నడపకూడదని ప్రభుత్వం నిర్ణయించుకుందని కాంగ్రెస్ సీనియర్ నేత కెసి వేణుగోపాల్ విమర్శించారు. కాగా, మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. సభలో గందరగోళం నెలకొనడంతో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేశారు. తిరిగి సభ పారంభమైనా మధ్యాహ్నం 1 గంటకు మరోసారి వాయిదాపడింది. ఇకపోతే పార్లమెంటులో మంగళవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజ్యసభకు ఛైర్మన్‌గా ఉన్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పై కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈక్రమంలో ఆయన పక్షపాతిగా వ్యవహరిస్తున్నారంటూ ఆక్షేపించింది. ఈ అవిశ్వాస తీర్మాణానికి తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌తో సహా ఇండియా కూటమి నేతలు మద్దతిచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

సివిల్స్ ఇంటర్వ్యూకి 90 మందికిపైగా అర్హత!

సత్తా చాటిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు

న్యూఢిల్లీ,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షల ఫలితాలు విడుదలైన సంగతి తెలిసిందే. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20, 21, 22, 28, 29 తేదీల్లో మెయిన్ పరీక్షలు జరిగాయి. ఈ ఫలితాలను డిసెంబర్ 9న సాయంత్రం యూపీఎస్సీ విడుదల చేసింది. పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కు అర్హత సాధించిన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లతో కూడిన జాబితాను విడుదల చేసింది. ఈ ఏడాదికి మొత్తం 1056 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి జులై 1న ఫలితాలు వెల్లడించారు. ఆ తర్వాత సెప్టెంబర్‌లో మెయిన్స్ నిర్వహించగా తాజాగా ఫలితాలు వెల్లడించారు. యూపీఎస్సీ పరీక్షలు మొత్తం మూడు దశల్లో జరుగుతాయి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పూర్తవగా త్వరలోనే ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఇంటర్వ్యూలో సత్తా చాటిన అభ్యర్థులను ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, ఇతర కేంద్ర (గ్రూప్ ఏ, గ్రూప్ బి) సర్వీసులకు ఎంపిక చేస్తారు. అయితే మెయిన్స్‌లో క్వాలిఫై అయిన వారిని మాత్రమే ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

కరోనా కనీవినీ ఎరుగని విపత్తు

కొవిడ్ వ్యాక్సిన్ ప్రజల ప్రాణాలను కాపాడింది

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): కరోనా సమయంలో కొవిడ్ వ్యాక్సిన్ ప్రజల ప్రాణాలను కాపాడిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు తెలిపింది. కరోనా వ్యాక్సిన్ కారణంగా తమ పిల్లలు మృతి చెందారంటూ ఇద్దరు మహిళల తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీవీ వరాలేతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీ వాదనలు వినిపించారు. కొవిడ్-19 మహమ్మారి కనీవినీ ఎరగని విపత్తు అన్నారు. వ్యాక్సిన్ పంపిణీ కారణంగా ప్రజల ప్రాణాలు నిలబడ్డాయన్నారు. వ్యాక్సినేషన్, దాని దుష్ప్రభావాల అంశాన్ని సుప్రీంకోర్టు ఇప్పటికే సమగ్రంగా పరిశీలించిందన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... వ్యాక్సిన్ విషయంలో ఎలాంటి వివాదం లేదని, కానీ ఆ వ్యాక్సినేషన్ తర్వాతే వారు చనిపోయారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వీరి మృతిపై నిపుణులతో కూడిన వైద్య బృందాన్ని ఏర్పాటు చేయడం, పోస్టుమార్టం నివేదికను ఇవ్వడం, నిర్దేశించిన కాల వ్యవధిలో దర్యాప్తు పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. ఇరువురి వాదనలు విన్నసుప్రీంకోర్టు పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నట్లు తెలిపింది.

ఆటో డ్రైవర్లకు 10 లక్షల ఇన్సూరెన్స్

ఏడాదికి రూ.5000, ఆడపిల్లల పెళ్లిళ్లకు రూ.1 లక్ష

అరవింద్ కేజ్రీవాల్ హామీల వర్షం

న్యూఢిల్లీ,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆటో డ్రైవర్లపై ఆమ్ ఆద్మీ పార్టీ-ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ హామీల వర్షం కురిపించారు. దిల్లీ ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షల వరకు లైఫ్ ఇన్సూరెన్స్ ప్రకటించారు. దీంతో పాటు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా కూడా ప్రకటించారు. అంతేకాకుండా ఆటో డ్రైవర్ల కూతుళ్ల పెళ్లిళ్లకు రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆటోవాలాలకు యూనిఫాం అలవెన్స్ కింద ఏడాదికి రెండు సార్లు రూ.2,500 చొప్పున ఇస్తామని చెప్పారు. ఆటో డ్రైవర్ల పిల్లలకు ఉచిత కోచింగ్ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం కోండ్లి నియోజకవర్గంలోని ఓ ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యులతో కేజ్రీవాల్ మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం హామీలు ప్రకటించారు. ఈ సందర్భంగా 'పూచో' యాప్?ను ప్రారంభించారు అరవింద్ కేజ్రీవాల్. రిజిస్టర్డ్? ఆటో డ్రైవర్ల మొబైల్? నంబర్స్?తో ఓ డేటాబేస్?ను దిల్లీ? ఇంటిగ్రేడెట్ మల్టీ మోడల్ ట్రాన్సిట్ సిస్టమ్? అభివృద్ధి చేసింది. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు డ్రైవర్? నంబర్?కు కాల్? చేసి రైడ్ బుక్? చేసుకోవచ్చు.ఇదిలా ఉండగా, దిల్లీలో ఉన్న 70 అసెంబ్లీ స్థానాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నాయి. బీజేపీ, కాంగ్రెస్?తో హోరాహోరీగా పోరాడుతున్న ఆప్?, వరుసగా మూడోసారి అధికారాన్ని దక్కించుకోవాలని తహతహలాడుతోంది.

అక్రమ వలసదారులపై అంకుశం

చట్టబద్ధ వలసదారులకు రాచమార్గం

మరోమారు స్పష్టం చేసిన ట్రంప్

వాషింగ్టన్,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): తాను అధ్యక్ష పదవి చేపట్టగానే అక్రమ వలసదా రులు అందరినీ అమెరికా నుంచి వెళ్లగొట్టి, చట్టబద్ధంగా వలస వచ్చేవారికి మార్గం సులువు చేస్తానని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇది భారతీయులకు శుభవార్త కావ చ్చు. ఈ మేరకు ఆయన ఎన్.బి.సి. టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలు వెల్లడించారు. 'అమెరికాలో సాధికారికంగా ప్రవేశం పొందాలను కునేవారు ఈ దేశాన్ని ప్రేమించాలి. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ అంటే ఏమిటో చెప్పగలగాలి' అని ట్రంప్ అన్నారు. 'కొన్ని దేశాల జైళ్ల నుంచి నేరస్థులు నేరుగా అమెరికాకు వస్తున్నారు. అలాంటి 13,099 మంది నేరస్థులు అమెరికా వీధుల్లో స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఈ ప్రమాదకర వ్యక్తులను మన దేశంలో ఉండనివ్వకూడదు. తక్షణం వెళ్లగొట్టాలి'అని ఉద్ఘాటించారు. అమెరికాకు అక్రమంగా వలస వచ్చిన తల్లిదండ్రుల సంతానం ((డ్రీమర్స్)లో చాలామంది ఇక్కడే పుట్టి పెరిగారని, వారిలో చాలామంది గొప్ప ఉద్యోగాలు, వృత్తులు చేస్తున్నారని చెప్పారు. వారి సమస్యను పట్టించుకుంటానని స్పష్టంచేశారు. ప్రతిపక్ష డెమోక్రాట్లతో కలసి ఒక పరిష్కారం కనుగొంటానని వివరించారు.పొరుగు దేశాలైన కెనడా, మెక్సికోల నుంచి అమెరికాలోకి లక్షల మంది అక్రమ వలసదారులు పోటెత్తుతున్నారని, దీన్ని నిరోధించకపోతే ఆ రెండు దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తానని ఇటీవల ట్రంప్ ప్రకటించారు. దీనిపై రెండు దేశాలు హాహాకారాలు చేయగా కెనడా, మెక్సికోలు అమెరికాలో 51వ, 52వ రాష్ట్రాలుగా చేరిపోవడం మంచిదని ఆయన సలహా ఇచ్చారు. అమెరికా ఇప్పటికే కెనడాకు 10,000 కోట్ల డాలర్లు, మెక్సికోకు 30,000 కోట్ల డాలర్ల చొప్పున రాయితీలు ఇస్తోందనీ, వీటిని కట్టిపెట్టాల్సి ఉందన్నారు. చైనా తదితర దేశాలపై సుంకాలు పెంచితే సరకుల ధరలు పెరిగి సామాన్య అమెరికన్ పౌరులు నష్టపోతారని కంపెనీల సీఈవోలు కొందరు చేస్తున్న హెచ్చరికలను ట్రంప్ తోసిపుచ్చారు. సుంకాల సాయంతో తాను యుద్ధాలు ఆపానన్నారు.

సంజయ్ మల్హోత్రకు అభినందనలు

మల్హోత్రకు అపారమైన అనుభవం ఉంది

సైబర్ సెక్యూరిటీ ఆర్బీఐ ముందున్న సవాల్: శక్తికాంతదాస్

న్యూఢిల్లీ,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): సైబర్ సెక్యూరిటీ అంశం సవాల్‌గా మారుతోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్ అన్నారు. ఆర్బీఐ గవర్నర్‌గా తన చివరిరోజున విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్త ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్న సంజయ్ మల్హోత్రకు అభినందనలు తెలిపారు. ఆయనకు అపారమైన అనుభవం ఉందని, సీబీడీసీ, యూఎల్ఎక్స్ వంటి ఆర్బీఐ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించే సత్తా ఉన్న వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన ఇంకా మాట్లాడుతూ, సైబర్ సెక్యూరిటీ ఆర్బీఐ ముందున్న అతిపెద్ద సవాల్ అన్నారు. సైబర్ హెచ్చరికలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కొత్త టెక్నాలజీని ఉపయోగించే అంశంపై దృష్టి సారించాలన్నారు. అలాగే, ద్రవ్యోల్బణం, వృద్ధి మధ్య సమతుల్యతలను పునరుద్ధరించడం అత్యంత ముఖమైన విషయమన్నారు. గత నాలుగేళ్లుగా కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, దీంతో గత అక్టోబర్‌లో ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠస్థాయి 6.21 శాతానికి పెరిగిందన్నారు.ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర బ్యాంకు బృందానికి ఆయన ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. ఈరోజు పదవీ విరమణ చేయనున్నానని... ఇన్నాళ్లు తనకు మద్దతుగా నిలిచిన వారికి ధన్యవాదాలు అని పేర్కొన్నారు. దేశానికి సేవ చేసే అవకాశం కల్పించిన మోదీకి ధన్యవాదాలు అని రాసుకొచ్చారు. ఆర్థికమంత్రిత్వ శాఖ, ఆర్బీఐ మధ్య గత ఆరేళ్లుగా సమన్వయం బాగుందని పేర్కొన్నారు.

మహిళలకు లాడ్లీ బహనా యోజన

పథకం కింద ఏటా రూ.15 వేలు

నేడు 19వ విడత లబ్ధిదారుల ఖాతాల్లోకి

న్యూఢిల్లీ,డిసెంబర్10 (ఋషి ప్రతినిధి): మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రకంకాల పథకాలు ప్రవేశపెడుతూ ఉంటాయి. ఈ క్రమంలోనే నెల నెలా అకౌంట్లలో డబ్బులు జమ చేస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే లాడ్లీ బహనా యోజన కింద మహిళలకు ఏటా రూ.15 వేలు జమ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ లాడ్లీ బహనా యోజనలో భాగంగా 19వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రేపు లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేయనున్నారు. మధ్యప్రదేశ్‌లో అధికారంలో ఉన్న మోహన్ యాదవ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం.. మహిళల కోసం లాడ్లీ బహనా యోజన పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద లబ్ధిదారులైన మహిళల ఖాతాల్లో నెలకు 1250 జమ చేస్తోంది. మొత్తంగా ఒక్కో మహిళకు ఏడాదికి రూ.15 వేలు అందిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా లాడ్లీ బహనా యోజన 19వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రేపు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్.. డబ్బులు అకౌంట్లలో వేయనున్నారు. ఈ సందర్భంగా అర్హులైన మహిళలు.. తమ ఖాతాల్లో డబ్బులు పడ్డాయో లేదో తెలుసుకునేందుకు వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. డిసెంబర్ 11వ తేదీన జన్ కళ్యాణ్ పర్వ్ ప్రారంభించనున్న సీఎం మోహన్ యాదవ్.. లాడ్లీ బహనా యోజన 19వ విడత డబ్బులు విడుదల చేయనున్నారు.లాడ్లీ బహనా యోజన కింద ప్రతీ మహిళకు నెలకు రూ.1250 చొప్పున ఏడాదికి రూ.15వేలు అందనున్నాయి. ఆధార్ కార్డుతో లింక్ అయిన బ్యాంక్ అకౌంట్‌లో నేరుగా డబ్బులు జమ చేయనున్నారు. 2023 జూన్ నుంచి మధ్యప్రదేశ్‌లో మహిళలకు ఆర్థికంగా స్వతంత్ర్యంగా తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు, వారి పిల్లలకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించేందుకు గానూ బీజేపీ ప్రభుత్వం ఈ లాడ్లీ బహనా యోజనను ప్రవేశపెట్టింది. లాడ్లీ బహనా యోజన కింద ప్రభుత్వం నుంచి నేరుగా సాయం పొందేందుకు లబ్ధిదారులు తప్పనిసరిగా మధ్యప్రదేశ్‌కు చెందినవారు అయి ఉండాలి. మహిళలకు పెళ్లి అయి ఉండాలి. భర్త చనిపోయిన మహిళలు, విడాకులు తీసుకున్న వారు, ఒంటరి మహిళలలు ఎవరైనా ఈ లాడ్లీ బహనా యోజనకు అప్లై చేసుకోవచ్చు. ఇక మహిళల వయసు.. 21 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు ఉండాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలు పెట్టింది.

మమతాబెనర్జీ నాయకత్వాన్ని సమర్థిస్తున్నా: లాలూ

న్యూఢిల్లీ,డిసెంబర్ 10 (ఋషి ప్రతినిధి): ఇండియా కూటమికి నాయకత్వాన్ని వహించే విషయంలో బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి సపోర్టు ఇస్తున్నట్లు ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదఎ తెలిపారు. ఇండియా కూటమిని నడిపించే బాధ్యత ఆమెకు అప్పగించాలన్నారు. కూటమికి నాయకత్వం వహించేందుకు రెడీ ఉన్నట్లు తృణమూల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జీ ఇటీవల పేర్కొన్నారు. కూటమి వ్యవహరిస్తున్న తీరుపై ఆందోళన వ్యక్తం చేసిన ఆమె.. అవకాశం వస్తే ఛార్జ్ తీసుకోనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ అభ్యంతరాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, ఇండియా కూటమిని లీడ్ చేసేందుకు మమతాకు అనుమతి ఇవ్వాలని లాలూప్రసాద్ తెలిపారు.

అందమైన లొకేషన్‌లో గేమ్‌ఛేంజర్ పాట

గ్లోబల్ స్టార్ రాంచరణ్, స్టార్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో వస్తోన్న సినిమా గేమ్‌ఛేంజర్. బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవలే నానా హైరానా సాంగ్ విడుదల చేశారని తెలిసిందే. ఈ పాట అందమైన లొకేషన్స్ లో రాంచరణ్, కియారా అద్వానీ మధ్య కలర్‌ఫుల్‌గా సాగుతుంది. తాజాగా ఈ సాంగ్ మేకింగ్ వీడియోను, స్టిల్స్‌ను సోషల్ మీడియా ద్వారా అందరితో షేర్ చేశాడు రాంచరణ్. ఈ వీడియో, స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. గేమ్ ఛేంజర్‌లో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యాలీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

అల్లు అర్జున్ దెబ్బకు బాక్సాఫీస్ షేక్..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతుంది. నాలుగు రోజుల్లోనే రూ.829 కోట్ల గ్రాస్ రాబట్టి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా అత్యధిక వసూళ్లు రాబడుతూ దూసుకుపోతుంది. డైరెక్టర్ సుకుమార్ డైరెక్షన్, అల్లు అర్జున్ నటవిశ్వరూపం చూసి అడియన్స్, విమర్శకులు ఫిదా అవుతున్నారు. ఈ సినిమా మొదటి రోజు ఏకంగా రూ.294 కోట్ల గ్రాస్ రాబట్టింది. ఇక ఆదివారం ఒక్కరోజే రెండు వందల కోట్ల వరకు రాబట్టింది. హిందీ మార్కెట్లోనే రూ.86 కోట్లు కలెక్ట్ చేసిన సినిమాగా పుష్ప 2 నిలిచింది. ఇక సోమవారం సైతం పుష్ప 2 వసూళ్లు భారీగానే వచ్చినట్లుగా తెలుస్తోంది ఐదో రోజు రూ.80 నుంచి వంద కోట్ల వరకు వచ్చినట్లు సమాచారం. ప్రతీరోజూ పుష్ప రూ.150 నుంచి రూ.200 కోట్లకు పైగా రాబట్టింది. ఇప్పుడు ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.900 కోట్ల మార్క్ దాటబోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మేకర్స్ ముందు నుంచి చెబుతున్నట్లుగానే రూ.1000 కోట్లు రాబట్టేలా ఉంది.ఇప్పటివరకు ఈ సినిమా రూ.830 కోట్ల వరకు రాబట్టినట్లు సమాచారం. ఇక సోమవారం లెక్కలు కలిపితే ఈ సినిమా రూ.900 కోట్లు రావడం ఖాయమని తెలుస్తోంది. ఆరు రోజుల్లో ఈ చిత్రం రూ.1000 కోట్ల మార్క్ క్రాస్ చేసేలా ఉంది.

ఓటీటీలో తంగలాన్

కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం తంగలాన్. హిస్టారికల్ డ్రామాగా పా రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతి తిరువొత్తు ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషించగా.. పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీలక పాత్రలు పోషించారు. ఆగస్టు 15న తెలుగు,తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఓటీటీ ప్రీమియర్ అప్‌డేట్ వచ్చేసింది. 100 రోజుల తర్వాత ఓటీటీలోకి వచ్చేసింది. ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో ప్రీమియర్ అయింది. ప్రస్తుతం తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. మరి ఓటీటీలో తంగలాన్‌కు ప్రేక్షకులను ఎలాంటి స్పందన వస్తుందనేది చూడాలి. ఇంకేంటి తంగలాన్‌పై మీరూ లుక్కే యండి. ఈ మూవీని స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై కేఈ జ్ఞానవేల్ రాజా తెరకెక్కించగా.. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు.

అందుకే పోరాటం చేస్తున్నా

టాలీవుడ్ యాక్టర్ మంచు మోహన్ బాబు ఫ్యామిలీ వార్ కొన్ని రోజులుగా సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇప్పటికే మోహన్‌బాబు, కుమారుడు మంచు మనోజ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది, ఈ ఘటనలో కాళ్లకు గాయాలవడంతో మంచు మనోజ్ బంజారాహిల్స్‌లోని టీఎక్స్ ఆస్పత్రిలో చేరాడు. ఈ వ్యవహారంలో ఇప్పటికే మంచు మనోజ్, మోహన్ బాబు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తన ఇంటి దగ్గర హైడ్రామా నేపథ్యంలో నా బిడ్డలు ఇంట్లో ఉండగా ఇలా చేయడం సరికాదు. నా భార్యా పిల్లలకు రక్షణ లేకుండా పోయింది. నా భార్యాపిల్లలకు రక్షణ ఉండేందుకే బౌన్సర్లను తెచ్చుకున్నా. మా బౌన్సర్లను ఎందుకు బయటకు పంపారు. నా కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులను కోరా. పోలీసులను ప్రొటెక్షన్ అడిగితే నా అనుచరులను బెదిరిస్తున్నారు. వారు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. న్యాయం కోసం అందరినీ కలుస్తానన్నాడు. నేను డబ్బు కోసమే, ఆస్తి కోసం పోరాటం చేయడం లేదు. నా ఆత్మగౌరవం కోసం పోరాటం చేస్తున్నానన్నాడు. మనోజ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని తెలియజేస్తూ రాచకొండ సీపీకి మోహన్ బాబు లేఖ రాశారు. తనకు రక్షణ కల్పించాలని రాచకొండ సీపీని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు మంచు మనోజ్ పహాడి షరీఫ్‌లో తనపై 10 మంది వ్యక్తులు దాడి చేశారని, విజయ్, కిరణ్ సీసీటీవీ ఫుటేజ్ తీసుకెళ్లారని.. తనకు ప్రాణహాని ఉన్న నేపథ్యంలో రక్షణ కల్పించాలని పోలీసులను కోరాడు. ఈ వ్యవహారంలో ఇప్పటికే మంచు విష్ణు, మంచు లక్ష్మి కూడా ఎంట్రీ ఇవ్వగా.. మరి ఎలాంటి మలుపులు తిరుగుతుందనేది తెలియాల్సి ఉంది.

మోహన్‌బాబు ఫిర్యాదులో ఇలా..?

రంగారెడ్డి జిల్లా జల్‌పల్లిలోని మంచుటౌన్ షిప్‌లో తాను పదేండ్లుగా నివాసముంటున్నాని మోహన్‌బాబు తన ఫిర్యాదులో తెలిపారు. తన చిన్న కొడుకు మనోజ్, కోడలు మౌనిక అనుచరులతో వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వెల్లడించారు. తన 7 నెలల కూతురిని వదిలేసి మనోజ్ అతని భార్య బయటకు వెళ్లిపోతారని, ఆ పాపను ఇంట్లో పనిచేసే మహిళనే సంరక్షకురాలిగా ఉంటుందని వెల్లడించారు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో మనోజ్, 30 మంది అనుచరులు దౌర్జన్యంగా ఇంట్లోకి చొరబడ్డారని, ఇంట్లో ఉన్నవారిని బెదిరించి ఇల్లు ఖాళీ చేయాలంటూ భయపెట్టారని పేర్కొన్నారు. తన ఆస్తులను కాజేసేందుకు మనోజ్ కుట్ర చేస్తున్నారని, తనకు ప్రాణహాని ఉందని, తనకు, తన ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు.

మనోజ్ ఫిర్యాదులో ఇలా...

ఈ నెల 8వ తేదీన ఉదయం సమయంలో గుర్తుతెలియని పది మంది వ్యక్తులు తన ఇంట్లోకి ప్రవేశించి అరుపులు, కేకలు వేశారని, అడ్డుకోబోయిన తనపై దాడి చేసి పరారయ్యారంటూ మనోజ్ సోమవారం పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దవాఖానలో చికిత్స చేయించుకున్నానని, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సాలిడ్ కమ్ బ్యాక్ కోసం సమంత ప్లానింగ్.!

ఒకప్పుడు స్టార్ లీగ్‌లో కనిపించిన.. ఈ మధ్య స్లో అయ్యారు. హెల్త్ ఇష్యూస్ కారణంగా బ్రేక్ తీసుకున్న ఈ బ్యూటీ తరువాత బాలీవుడ్ మీద ఫోకస్ చేస్తున్నారు. ఎక్కువగా డిజిటల్ ప్రాజెక్టస్ మీదే దృష్టి పెట్టిన సమంత, అందులోనూ యాక్షన్ రోల్స్‌కే ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. ఆల్రెడీ రిలీజ్ అయిన షోస్‌తో పాటు సెట్స్ మీద ఉన్న ప్రాజెక్ట్స్‌లోనూ అలాంటి క్యారెక్టర్సే ప్లే చేస్తున్నారు. సమంత ఇమేజ్‌ను పూర్తిగా మార్చేసిన ప్రాజెక్ట్ ది ఫ్యామిలీ మ్యాన్ 2.ఒకప్పుడు స్టార్ లీగ్‌లో కనిపించిన.. ఈ మధ్య స్లో అయ్యారు. హెల్త్ ఇష్యూస్ కారణంగా బ్రేక్ తీసుకున్న ఈ బ్యూటీ తరువాత బాలీవుడ్ మీద ఫోకస్ చేస్తున్నారు. ఎక్కువగా డిజిటల్ ప్రాజెక్టస్ మీదే దృష్టి పెట్టిన సమంత, అందులోనూ యాక్షన్ రోల్స్‌కే ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. ఆల్రెడీ రిలీజ్ అయిన షోస్‌తో పాటు సెట్స్ మీద ఉన్న ప్రాజెక్ట్స్‌లోనూ అలాంటి క్యారెక్టర్సే ప్లే చేస్తున్నారు. సమంత ఇమేజ్‌ను పూర్తిగా మార్చేసిన ప్రాజెక్ట్ ది ఫ్యామిలీ మ్యాన్ 2. అప్పటి వరకు సౌత్ సినిమాల్లో జస్ట్ గ్లామర్ హీరోయిన్‌గా మాత్రమే ఉన్న సామ్, ఈ షోలో బోల్డ్ సీన్స్‌తో పాటు యాక్షన్ సీన్స్‌లోనూ నటించారు. నార్త్ ఎంట్రీలో యాక్షన్ ఇమేజ్ సమంతకు బాగానే హెల్ప్ అయ్యింది. అందుకే అదే టీమ్‌తో వరుస ప్రాజెక్ట్స్ చేస్తున్నారు సామ్. ఆల్రెడీ ది ఫ్యామిలీ మ్యాన్ 3లోనూ సమంత కనిపించబోతున్నారన్న హింట్ ఇచ్చారు మేకర్స్. ది ఫ్యామిలీ మ్యాన్ 2 తెరకెక్కించిన రాజ్ అండ్ డీకేనే, రీసెంట్‌గా రిలీజ్ అయిన సిటాడెల్ హనీ బన్నీకి కూడా దర్శకులు. హాలీవుడ్‌లో సూపర్ హిట్ అయిన సిటాడెల్‌ను ఇండియన్ నేటివిటికీ తగ్గట్టుగా మార్చి తెరకెక్కించారు రాజ్ అండ్ డీకే. ఈ షోలో ఏజెంట్‌గా యాక్షన్ రోల్‌లోనే కనిపించారు. ప్రజెంట్ రక్త బ్రహ్మాండ్ అనే భారీ వెబ్ సిరీస్‌ను రూపొందిస్తున్నారు రాజ్ అండ్ డీకే. పీరియాడిక్ జానర్‌లో తెరకెక్కుతున్న ఈ సిరీస్‌లో ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫజల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ షోలో సమంత యువరాణిగా కీలక పాత్రలో నటించబోతున్నారు.అంతేకాదు ఇందులోనూ యాక్షన్ రోలే ప్లే చేస్తున్నానని చెప్పారు సామ్. దీంతో సామ్ ఇక రెగ్యులర్ గ్లామర్ రోల్స్‌కు గుడ్ బై చెప్పేసినట్టేనా అన్న డిస్కషన్ జరుగుతోంది.

వర్మకు ముందస్తు బెయిల్ మంజూరు

టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మకు ఏపీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. వర్మపై నమోదైన మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరైంది. వర్మపై ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఘటనలో ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే.. దీంతోపాటు సినిమా పోస్టర్లపై అనకాపల్లి, తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లలో వర్మ మీద కేసులు నమోదు కాగా.. తాజాగా ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. మద్దిపాడు పీఎస్‌లో నమోదైన కేసులో ఏపీ పోలీసులు పలు మార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ.. విచారణకు హాజరుకాని వర్మ ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేశాడు. ఇటీవలే ఈ కేసులో రాంగోపాల్ వర్మకు ఏపీలో హైకోర్టులో ఊరట లభించింది. ఇటీవల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆర్జీవీ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టిన కోర్టు ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

బాక్సింగ్ డే టెస్టుకు లక్ష టికెట్లు హాట్ కేకుల్లా..!

భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆసక్తికరంగా సాగుతోంది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో టీమిండియా సంపూర్ణ ఆధిపత్యం చెలాయించి 295 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి బోణీ కొట్టింది. అడిలైడ్ వేదికగా జరిగిన డే/నైట్ టెస్టులో ఆస్ట్రేలియా అద్భుతంగా పుంజుకుని 10 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో భారత జట్టు ఆధిక్యాన్ని 1-1తో సమం చేసింది. ఆటతో పాటు ఆటగాళ్ల మధ్య గొడవలు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని మరింత రసవత్తరంగా మార్చింది. తొలి టెస్టులో హర్షిత్ రాణా %శ% మిచెల్ స్టార్క్‌బీ యశస్వీ జైస్వాల్ %శ% మిచెల్ స్టార్క్ మధ్య కవ్వింపులు సాగాయి. ఇక రెండో టెస్టులో ట్రావిస్ హెడ్, మహ్మద్ సిరాజ్ మధ్య హైవోల్టేజ్‌తో జరిగిన వాగ్వాదం ఐసీసీ చర్యలు తీసుకునేంత స్థాయి వరకు వెళ్లింది. సాధారణంగా బలమైన జట్లు భారత్ %శ% ఆస్ట్రేలియా మ్యాచ్ అంటే హోరాహోరీగా సాగుతోంది. దీనికి తోడుగా వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే ఇరు జట్లకు కీలకంగా మారడంతో అంచనాలు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో మరో 15 రోజుల తర్వాత ప్రారంభం కానున్న బాక్సింగ్ డే టెస్టు తొలి రోజు టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. మూడో టెస్టు మొదలుకాకముందే నాలుగో టెస్టుకు భారీ డిమాండ్ నెలకొంది. తొలి రోజుకు సంబంధించి అందుబాటులో ఉన్న పబ్లిక్ టికెట్లన్నీ అమ్ముడయ్యాయని ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు ప్రకటించింది. మెల్‌బోర్న్ స్టేడియం కెపాసిటీ దాదాపు లక్ష మందికి ఉంటుంది. కాగా, అడిలైడ్ పింక్ బాల్ టెస్టుకు మూడు రోజుల్లో 1,35,012 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. ఈ క్రమంలో 2014-15లో అయిదు రోజులు పాటు సాగిన అడిలైడ్ టెస్టుకు హాజరైన గరిష్ట ప్రేక్షకుల సంఖ్య 113,009 రికార్డు బ్రేక్ అయ్యింది.

ఆస్ట్రేలియాతో అయిదు టెస్టుల సిరీస్ షెడ్యూల్

నవంబర్ 22-26:
తొలి టెస్టు- పెర్త్ - భారత్ విజయం
డిసెంబర్ 06-10: రెండో టెస్టు (డే/నైట్)- అడిలైడ్ - ఆస్ట్రేలియా విజయం
డిసెంబర్ 14-18:
మూడో టెస్టు- బ్రిస్బేన్ (ఉదయం 5.50)
డిసెంబర్ 26-31: నాలుగో టెస్టు- మెల్‌బోర్న్ (ఉదయం 5 గంటలకు)
జనవరి 03-08: అయిదో టెస్టు- సిడ్నీ (ఉదయం 5 గంటలకు).

ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డుపై కన్నేసిన నితీశ్ రెడ్డి!

అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ వేదికగా జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో భారత్ 10 వికెట్ల తేడాతో ఘోర పరాజయం చవిచూసింది. అన్ని విభాగాల్లో విఫలమై సిరీస్‌లో ఆధిక్యాన్ని 1-1తో సమం చేసుకుంది. ఓటమిపాలైనప్పటికీ భారత శిబిరంలో నితీశ్ కుమార్ రెడ్డి ప్రదర్శన ఓదార్పు ఇచ్చింది. ఈ యువ ఆల్‌రౌండర్ రెండు ఇన్నింగ్స్‌ల్లో టీమిండియా ఇన్నింగ్స్‌లో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. ఛేదనలో నితీశ్ కుమార్ రెడ్డి 47 బంతుల్లో 42 పరుగులు చేశాడు. ఆరు ఫోర్లు, ఒక సిక్సర్ బాదాడు. మొదటి ఇన్నింగ్స్‌లో ఈ తెలుగు తేజం 54 బంతుల్లో 42 పరుగులు చేశాడు. మూడు ఫోర్లు, మూడు సిక్సర్లు సాధించాడు. ఈ క్రమంలో నితీశ్ రెడ్డి అరుదైన రికార్డు కూడా నెలకొల్పాడు. ఏడో స్థానంలో లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్ ఆర్డర్‌లో వచ్చి ఓ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ టాప్ స్కోరర్‌గా నిలిచిన భారత నాలుగో బ్యాటర్‌గా చందు బోర్డే, ఎంఎస్ ధోనీ, రవిచంద్రన్ అశ్విన్ సరసన నితీశ్ రెడ్డి నిలిచాడు. అయితే నితీశ్ రెడ్డి మరో అరుదైన రికార్డుపై కన్నేశాడు. మరో ఆరు సిక్సర్లు సాధిస్తే ఆస్ట్రేలియాలో టెస్టు ఫార్మాట్‌లో అత్యధిక సిక్సర్లు సాధించిన పర్యాటక జట్టు బ్యాటర్‌గా నితీశ్ చరిత్ర సృష్టిస్తాడు. కంగారూల గడ్డపై సుదీర్ఘ ఫార్మాట్‌లో క్రిస్ గేల్, వివ్ రిచర్డ్స్ 12 సిక్సర్లు సాధించి సంయుక్తంగా రికార్డు కొనసాగిస్తున్నారు. కాగా, తొలి రెండు టెస్టుల్లోనే నితీశ్ ఏడు సిక్సర్లు బాదాడు. ప్యాట్ కమిన్స్, స్కాట్ బొలాండ్ బౌలింగ్‌లో రెండేసి సిక్సర్లు, మిచెల్ మార్ష్, మిచెల్ స్టార్క్, లబుషేన్ బౌలింగ్‌లో ఒక్కో సిక్సర్ బాదాడు. ఈ క్రమంలో ఇప్పటికే ఆస్ట్రేలియాలో ఫాస్ట్ బౌలింగ్‌లో అత్యధిక సిక్సర్లు సాధించిన భారత బ్యాటర్‌గా నితీశ్ రెడ్డి మరో అరుదైన ఘనత అందుకున్నాడు. పేస్ బౌలింగ్‌లో ఆరు సిక్సర్లు బాదాడు. అంతకుముందు ఈ రికార్డు జహీర్ ఖాన్, రిషభ్ పంత్, అజింక్య రహానె, రోహిత్ శర్మల పేరిట సంయుక్తంగా ఉండేది. ఈ ఆటగాళ్లంతా ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలింగ్‌లో మూడు సిక్సర్లు చొప్పున బాదారు. ఇక ఓవరాల్‌గా స్పిన్-పేస్‌లో ఆస్ట్రేలియా గడ్డపై అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాళ్ల జాబితాలో రిషభ్ పంత్-రోహిత్ శర్మ (10), వీరేంద్ర సెహ్వాగ్ (8) టాప్-3లో ఉన్నారు. మూడో టెస్టులో కనీసం సెహ్వాగ్ రికార్డును నితీశ్ బ్రేక్ చేసే అవకాశం ఉంది. గబ్బా వేదికగా శనివారం నుంచి మూడో టెస్టు జరగనుంది. భారత కాలమాన ప్రకారం ఉదయం 5.50 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది.

నా బిడ్డకు సవాలు విసురుతున్నా..

అప్పుడే బౌలర్ అని ఒప్పుకుంటా! హర్షిత్ రాణా తండ్రి

అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ వేదికగా జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో భారత్ 10 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. అన్ని విభాగాల్లో విఫలమై సిరీస్‌లో ఆధిక్యాన్ని 1-1తో సమం చేసుకుంది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వంటి సీనియర్లు సత్తాచాటలేకపోయారు. బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా మినహా మిగిలిన బౌలర్లు పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రాకు తోడుగా సిరాజ్ ఫర్వాలేదనిపించాడు. స్పిన్‌కు అంతగా అనుకూలించని పిచ్‌పై సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఒక్క వికెట్ మాత్రమే సాధించాడు. ఇక యువ పేసర్ హర్షిత్ రాణా నిరాశపరిచాడు. ఒక్క వికెట్ సాధించలేకపోయాడు. అంతేగాక రెండు సార్లు డకౌటయ్యాడు. బంతితో పాటు కీలక పరుగుల చేసే సామర్థ్యంతో తుదిజట్టులోకి వచ్చిన 22 ఏళ్ల హర్షిత్ రాణా విఫలమవ్వడంతో నెట్టింట్లో అతనిపై విమర్శలు వచ్చాయి. అయితే ఈ నేపథ్యంలో హర్షిత్ రాణా తండ్రి ప్రదీప్ రాణా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తన బిడ్డ హర్షిత్ రాణాను ఓ బౌలర్‌గా తాను భావించాలంటే, గంటకు 150 కిలోమీటర్ల వేగంతో బంతులు సంధించాలని ప్రదీప్ అన్నారు. అలా చేస్తే భారత జట్టు నుంచి తన కుమారుడిని ఎవరూ తప్పించలేరని చెప్పారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రదీప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "150 కి.మీ/గంట వేగంతో బౌలింగ్ చేయాలని హర్షిత్ రాణాకు సవాలు విసిరాను. ఆ వేగాన్ని అందుకోకపోతే బౌలర్‌గా పరిగణించనని చెప్పా. ఆ మార్క్ అందుకుంటే భారత్ తరఫున ఆడకుండా ఎవరూ అడ్డుకోలేరు. అదే 125 కి.మీ/గంట వేగంతో బౌలింగ్ చేస్తే లోకల్ క్లబ్‌లో కూడా బౌలర్‌గా ఎంపిక చేయరు" అని ప్రదీప్ అన్నారు. కాగా, రెండో టెస్టు అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ.. హర్షిత్ రాణాకు అండగా నిలిచాడు. తొలి టెస్టులో రాణా సత్తాచాటాడని, రెండో టెస్టులో నాణ్యమైన బ్యాటర్ ట్రావిస్ హెడ్ కారణంగానే ఒత్తిడికి గురయ్యాడని యువ పేసర్‌కు హిట్ మ్యాన్ మద్దతు ఇచ్చాడు. పెర్త్ టెస్టులో రాణా బాగా ఆడాడని, జట్టుకు అవసరమైన స్థితిలో రాణించాడని చెప్పాడు. ఓ మ్యాచ్‌లో అవకాశం ఇచ్చి మరో మ్యాచ్‌లో పక్కనపెట్టడం ప్లేయర్‌కే కాదు, జట్టుకు మంచిది కాదని రోహిత్ పేర్కొన్నాడు. అడిలైడ్ టెస్టులో రాణా 16 ఓవర్లు బౌలింగ్ చేశాడు. 5.40 ఎకానమీ రేటు తో పరుగులు సమర్పించుకున్నాడు.



తెలుగు టైటాన్స్ ఘోర పరాజయం

ప్రో కబడ్డీ లీగ్ సీజన్-11లో తెలుగు టైటాన్స్ మరో ఓటమి చవిచూసింది. పుణె వేదికగా సోమవారం హర్యానా స్టీలర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 46-25 పాయింట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ సీజన్‌లో నొయిడా వేదికగా అంతకుముందు తలపడిన మ్యాచ్‌లో హర్యానాను చిత్తు చేసిన టైటాన్స్.. నిన్నటి మ్యాచ్‌లో సత్తాచాటలేకపోయింది. 21 పాయింట్ల తేడాతో ఓటమిపాలై ఆరో స్థానానికి పడిపోయింది. ఈ సీజన్‌లో 18 మ్యాచ్‌లు ఆడిన తెలుగు టైటాన్స్ 10 విజయాలు, 8 ఓటములు చవిచూసింది. మరోవైపు హర్యానా 14 విజయాలు, 4 పరాజయాలతో టేబుల్ టాపర్‌గా కొనసాగుతోంది. కాగా, మ్యాచ్ ఆరంభం నుంచి హర్యానా పాయింట్ల వేట కొనసాగించింది. తొలి అర్ధభాగంలో టైటాన్స్‌ను రెండు సార్లు ఆలౌట్ చేసింది. ఫస్టాఫ్‌ను 28-9 భారీ తేడాతో ముగించింది.

టీమిండియాలో అశ్విన్‌ను తప్పించండి

భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆసక్తికరంగా సాగుతోంది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో టీమిండియా సంపూర్ణ ఆధిపత్యం చెలాయించి 295 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి బోణీ కొట్టింది. అడిలైడ్ వేదికగా జరిగిన డే/నైట్ టెస్టులో ఆస్ట్రేలియా అద్భుతంగా పుంజుకుని 10 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో భారత జట్టు ఆధిక్యాన్ని 1-1తో సమం చేసింది. ఆటతో పాటు ఆటగాళ్ల మధ్య గొడవలు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని మరింత రసవత్తరంగా మార్చింది. తొలి టెస్టులో హర్షిత్ రాణా %శ% మిచెల్ స్టార్క్‌బీ యశస్వీ జైస్వాల్ %శ% మిచెల్ స్టార్క్ మధ్య కవ్వింపులు సాగాయి. ఇక రెండో టెస్టులో ట్రావిస్ హెడ్, మహ్మద్ సిరాజ్ మధ్య హైవోల్టేజ్‌తో జరిగిన వాగ్వాదం ఐసీసీ చర్యలు తీసుకునేంత స్థాయి వరకు వెళ్లింది. దీనికి తోడుగా వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే ఇరు జట్లకు కీలకంగా మారడంతో సిరీస్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే మూడో టెస్టు భారత తుది జట్టులో మార్పులు చేయాలని మాజీలు, విశ్లేషకులు సూచిస్తున్నారు. సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ స్థానంలో వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోవాలని ఛెతేశ్వర్ పుజారా అన్నాడు. యువ పేసర్ హర్షిత్ రాణాను ప్లేయింగ్ 11లో కొనసాగించాలన్నాడు. "తుది జట్టులో ఒక్క మార్పు చోటు చేసుకుంటుందని భావిస్తున్నా. బ్యాటింగ్‌లో అంచనాలను అందుకోలేకపోతున్న నేపథ్యంలో అశ్విన్ స్థానంలో వాషింగ్టన్ సుందర్ వస్తాడనుకుంటున్నా. హర్షిత్ రాణా స్థానంలో మరో పేసర్‌ను తీసుకోవాలా అని అడిగితే.. వద్దని చెబుతాను. తొలి మ్యాచ్‌లో బాగా ఆడిన అతనికి మద్దతు ఇవ్వాలి" అని పుజారా పేర్కొన్నాడు. తొలి టెస్టులో ఆడిన సుందర్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 31 పరుగులు చేశాడు. 17 ఓవర్లు బౌలింగ్ చేసి రెండు వికెట్లు పడగొట్టాడు. రెండో టెస్టు ఆడిన అశ్విన్ 29 పరుగులు చేశాడు. 18 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక్క వికెట్ పడగొట్టాడు. మరోవైపు హర్షిత్ రాణా తొలి టెస్టులో 29 ఓవర్లు బౌలింగ్ చేసి నాలుగు వికెట్లు తీశాడు. రెండో టెస్టులో 16 ఓవర్లలో 5.40 ఎకానమీ రేటుతో పరుగులిచ్చి వికెట్ పడగొట్టలేదు.

విధ్వంసం సృష్టించిన విప్రజ్ నిగమ్

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త ఆటగాడు విప్రజ్ నిగమ్ విధ్వంసం సృష్టించాడు. ఈ బ్యాట్స్‌మెన్ తుఫాన్ ఇన్నింగ్స్ ఆడటం వల్లే యూపీ 4 వికెట్ల తేడాతో ఆంధ్రప్రదేశ్‌ను ఓడించి టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ఇరు జట్ల మధ్య ఉత్కంఠ రేపిన మ్యాచ్ జరిగింది. విప్రజ్ అలాంటి ఇన్నింగ్స్ ఆడాడు. రింకూ సింగ్ ఇన్నింగ్స్ అదిరిపోయింది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఆ జట్టు ఇప్పుడు ఢిల్లీతో పోటీ పడాల్సి ఉంది. దీంతో యూపీ జట్టు 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగింది. ఇటువంటి పరిస్థితిలో జట్టు వికెట్ నష్టపోకుండా 70 పరుగులు చేసింది. అది కూడా 8.1 ఓవర్లలో కావడం విశేషం. అయితే, మిడిలార్డర్‌లో ఏ బ్యాట్స్‌మెన్ కూడా నిలదొక్కుకోలేకపోయాడు. దీంతో ఆ జట్టు 109 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. దీంతో మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు పుంజుకుంది. ఆ తర్వాత విప్రజ్ నిగమ్‌కి రింకూ సింగ్ మద్దతు లభించింది. దీంతో జట్టు 24 బంతుల్లో 48 పరుగులు చేయాల్సి ఉంది. ఇద్దరూ మళ్లీ పరుగులు చేయడం ప్రారంభించారు. కేవలం మూడు ఓవర్లలోనే ఇద్దరూ కలిసి 48 పరుగులు చేశారు. కేవీ శశికాంత్ 17వ ఓవర్ వేసినప్పటికీ 22 పరుగులు ఇచ్చాడు. రింకూ సిక్సర్ కొట్టినా అసలు అద్భుతం మాత్రం విప్రజ్ చేసి చూపించాడు. మూడు సిక్సర్లు బాదాడు. ఈ విధంగా అతను కేవలం 8 బంతుల్లో 27 పరుగులు చేయడంతో జట్టు కేవలం 19 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. విప్రజ్ తన ఇన్నింగ్స్‌తో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును అందుకున్నాడు.

BHAGAVAD GITA PARAYANAM

5,161 ఏళ్ల నాటి గీత

...నేటి జీవనానికి ప్రమాణం

భగవద్గీత మానవాళికి అందిన రోజు.. సాక్షాత్తు శ్రీకృష్ణుడే గురువుగా మారి అర్జునుడికి జీవిత సత్యాలు, పరమాత్మ తత్వాన్ని బోధించిన రోజు.. మార్గశిర శుద్ధ ఏకాదశి.. అదే గీతా జయంతి. ఈ రోజునే మోక్షద ఏకాదని, ముక్కోటి ఏకాదశి అని కూడా జరుపుకుంటాం. సాధారణ భాషలో చెప్పాలంటే భగవద్గీత పుట్టిన రోజు. అర్జునుడికే కాదు.. కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకు, సందిగ్ధతకు సమాధానంగా భగవద్గీత ఈ నాటికీ ప్రమాణంగా నిలుస్తోంది. మనిషిని మనిషిగా జీవించేందుకు సన్మార్గంలో నడిపిస్తోంది. శ్రీకృష్ణ భగవానుడు బోధించిన జ్ఞానం కాబట్టి ఇది హిందువుల పరమ పవిత్ర గ్రంథాలలో ఒకటి. భగవద్గీతలో వేద, వేదాంత, యోగ విశేషాలున్నాయి. భగవద్గీతను 'గీత' అని.. 'గీతోపనిషత్తు' అని కూడా పిలుస్తాం.

త్రేతాయుగంలో పాండవులు, కౌరవులకు మధ్య కురుక్షేత్ర యుద్ధం జరుగుతుండగా.. యుద్ధ భూమిలో అర్జునుడు తన వాళ్లను, రక్త సంబంధకులను చూసి యుద్ధం చేయలేనని, తన గురువు, సోదరుల మీద బాణాలు వేయలేనని చెప్పి ఆయుధాలను వదిలేస్తాడు. అప్పుడు శ్రీకృష్ణుడు తన విశ్వరూపం చూపించి.. అర్జునుడికి కర్తవ్య బోధన చేశాడు. అదే గీతోపదేశం. గీతోపదేశాన్ని భగవద్గీతలో మొత్తం 18 అధ్యాయాలు.. 700 శ్లోకాలు ఉన్నాయి. యుద్ధ సమయంలో 45 నిమిషాల పాటు అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను వివరించాడు. మోక్షం ఎలా పొందాలి? మనిషి తన జీవితంలో ఎలా నడుచుకోవాలి? జీవితంలో ఉన్నత స్థానానికి ఎలా ఎదగవచ్చు? వంటి అంశాలను ఆ పరమాత్ముడే స్వయంగా గీతలో చెప్పాడు.

అర్జునుడికే గీతోపదేశం ఎందుకంటే..

భీష్ముడు, ద్రోణాచార్యుడు వంటి ఎంతోమంది ఉద్ధండులు ఉండగా.. శ్రీకృష్ణుడు కేవలం అర్జునుడికే ఎందుకు గీత బోధ చేశాడు? లాంటి సందేహానికి పండితులు గొప్ప వివరణ ఇచ్చారు. యుద్ధం చేయబోనని అర్జునుడు అన్నప్పుడే గీత బోధ చేసినా.. అర్జునుడికే చెప్పటానికి అనేక కారణాలు ఉన్నాయని అంటున్నారు. శ్రీకృష్ణార్జునులు నరనారాయణులు. అర్జునుడు అనేక దేవతల మెప్పు పొంది అస్త్ర శస్త్రాదులతో పాటు పరమేశ్వరుని మెప్పించి పాశుపతాస్త్రాన్ని సాధించాడు. బాల్యంలో అర్జునుడు సఖుడు, అనంతరం భక్తుడు. ఈ రెండింటినీ పరిగణనలోకి తీసుకుని 'రహస్యమైన గీతను ఉపదేశం చేశాను' అని శ్రీకృష్ణుడే చెప్పాడు. యుద్ధం చేయడమే తన కర్తవ్యమని అర్జునుడికి కృష్ణుడు గుర్తుచేస్తాడు. మనో బలహీనతను అధిగమించాలని ఆదేశిస్తాడు. బాధతో, ఆందోళనతో రగిలిపోతున్న అర్జునుడికి.. గురువుగా మారి ఆత్మ శాశ్వతమైనదని, అది చనిపోదని బోధిస్తాడు. వ్యక్తి శరీరం మాత్రమే నశిస్తుందని, ఆత్మ అలాగే ఉంటుందని.. అందువల్ల బాధపడేందుకు ఏమీ లేదని వివరిస్తాడు. బుద్ధి-యోగంలో నిమగ్నమై, ఫలితాలతో సంబంధం లేకుండా పని చేయాలని సలహా ఇస్తాడు. అర్జునుడికే బోధ చేసినా.. సమస్త మానవులకు అవసరమయ్యేలా కర్మ జ్ఞాన భక్తి యోగాలు ఉపదేశం చేశాడు శ్రీకృష్ణుడు.

'ఏకం శాస్త్రం దేవకీ పుత్రగీతమ్.. ఏకోదేవో దేవకీ పుత్ర ఏవ.. ఏకో మంత్రస్య నామానియాని.. కర్మాప్యేకం తస్య దేవస్య సేవా' అంటే.. గీతాశాస్త్రమే ఏకైక శాస్త్రం. దేవకీనందనుడు శ్రీకృష్ణుడే ఏకైక దైవం. ఆయన నామాలు దివ్యమంత్రాలు. ఆయన సేవే సత్కర్మయుక్త ఏకైక సేవ అని ఆర్యోక్తి. సృష్టిలో పరిణామం, మార్పులు అనివార్యం. ఏది ఆదిలో ఉన్నట్లు అంతంలో ఉండదు. జీవితం పరిమిత కాలం. నియమిత కాలంలో చేయగలిగే మంచిపనులే అపరిమిత తృప్తిని ఇవ్వగలుగుతాయి. తద్వారా జన్మ సార్థకమవుతుంది. ఈ జీవన సత్యమే భగవద్గీత పరమోపదేశం. పండితులు, పురాణాల ప్రకారం.. ఈ ఏడాది (2024)తో గీతా జయంతి 5,161వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది.

(నేడు గీతాజయంతి సందర్భంగా..)

గీతా జయంతి
రోజున ఏం చేయాలంటే..
భగవద్గీత పారాయణం చేయండి.
భగవద్గీత పుస్తకాన్ని దానం చేయండి.

బొమ్మకంటి గంగాధర్

గీతాజయంతి ప్రత్యేకత

'మాసానాం మార్గశీర్షోహం' అంటారు. అంటే.. అన్ని నెలలకు ఈ మాసం శిరస్సు వంటిది అని అర్థం. ఈ నెలలోనే కురుక్షేత్ర యుద్ధం ప్రారంభం అయ్యిందట. మార్గశిర మాసంలో శుక్ల పక్ష ఏకాదశి రోజు శ్రీకృష్ణుడు విశ్వరూపం చూపించి.. అర్జునుడికి గీతా ఉపదేశం చేశాడు. అందుకే.. మార్గశిర మాసం పాడ్యమి నుంచి పౌర్ణమి రోజు వరకు ఎంతో పవిత్రంగా గీతాజయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా హర్యానాలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యాహమ్
(ఓ అర్జునా! ఎప్పుడెప్పుడు ధర్మం క్షీణించి, అధర్మము వృద్ధి అవుతూ ఉంటుందో, అప్పుడప్పుడు నన్ను నేనే సృష్టించుకుంటూ వుంటా)

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే
(సాధు, సజ్జనులను సంరక్షించటం కోసం, దుర్మార్గులను వినాశం చేయడానికి, ధర్మాన్ని చక్కగా స్థాపించటం కోసం నేను ప్రతి యుగంలోనూ అవతరిస్తూ ఉంటా)

గీతా జయంతి శుభ సమయం

శుభ ముహూర్తం(బ్రహ్మ ముహూర్తం):
ఉదయం 05:07 నుంచి 06:01 వరకు
అమృత కాలం: 09:34 నుంచి 11:03 వరకు
నిషితా ముహూర్తం: 1:03 నుంచి 11:03 వరకు
డిసెంబర్ 12 వరకు రవియోగం:
ఉదయం 06:56 నుంచి 11:48 వరకు
అశుభ ముహూర్తం: (రాహు కాలం)
మధ్యాహ్నం 12:05 నుంచి 01:22 వరకు
భద్రకాలం: 02:27 నుండి 01:09 వరకు

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..
సంస్కృతిని కాపాడే లక్ష్యంగా..
మన ఔన్నత్యాన్ని పెంచేలా..
మన ఔచిత్యాన్ని చాటేలా..
తెలుగు చరిత్రలోనే తొలిసారి..
ధర్మం కోసం అక్షర తపస్సు చేస్తూ..
తెలుగు ప్రజల కోసం వస్తున్నది..

"ఋషి తెలుగు దినపత్రిక"

'కురుక్షేత్రం' అన్న పేరుతో..
సంపాదకీయాన్ని తీసుకొస్తున్నది
ఆసక్తి కలిగిన రచయితలు..
ధర్మ పరిరక్షకులు..
ఈ అక్షర యజ్ఞంలో
పాలుపంచుకోవాలని విజ్ఞప్తి.
కురుక్షేత్రం పేజీ కోసం తమ
వ్యాసాలు పంపి
మరింత మందికి జ్ఞానాన్ని
ప్రసాదించాలని వినతి.

కాపాడుకుందాం
మన దేశాన్ని!
మన ధర్మాన్ని!!

OWNED, PUBLISHED AND PRINTED BY **TIRUMALASHETTY RAMACHANDRA RAO**, PRINTED AT VAIBHAV ART PRINTERS, #11-5-419, RED HILLS, LAKADIKAPOOL, HYDERABAD500004, TELANGANA, PUBLISHED AT 6-1-628/4/7, MARKET ROAD, KHIRATABAD, HYDERABAD-4, TELANGANA EDITOR : **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NUMBER: APTEL/2008/26409, CELL: 9666711515, EMAIL: rhushinews@gmail.com